http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

సోమవారం 23 సెప్టెంబర్ 2024

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5    వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# పేదలకు తీపికబురు!



- ఇల్లు లేనివారికి త్వరలోనే శుభవార్త!
- ఇందిరమ్మ ఇళ్ళ పథకం విధి విధానాలు, మార్గదర్శకాలపై కసరత్తు
- అర్హుల ఎంపిక చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది
- క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టిన తర్వాత అర్హులను ఎంపిక చేయాలని భావిస్తోంది
- మార్గదర్శకాలు, విధివిధానాలను వారం, పది రోజుల్లో ఖరారు
- ఈ పథకాన్ని కేంద్రం అందించే ప్రధానమంత్రి ఆవాస యోజన పథకానికి అనుసంధానించాలని ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్

ఇళ్లు లేని పేదలకు త్వరలో తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించనుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు అవసరమైన విధి విధానాలను ప్రకటించనుంది. ఈ మేరకు మార్గదర్శకాలు, విధివిధానాలను వారం, పది రోజుల్లో ఖరారు చేయనున్నట్లు తెలిసింది. ఆ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ పథకాన్ని కేంద్రం అందించే ప్రధానమంత్రి ఆవాస యోజన పథకానికి అనుసంధానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. వాటిలో ఇంటి కోసం వచ్చిన దరఖాస్తులు దాదాపు 82 లక్షలు, అర్బన్ పరిధిలో 23.5 లక్షలు, రూరల్‌లో 52.5 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు మరో శుభవార్త చెప్పడానికి రెడీ అవుతుంది. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా పాలన పేరుతో ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలను - మిగతా3లో



## దాదాపు 7 కోట్లకు చేరిన అటల్ పెన్షన్ యోజన సబ్‌స్క్రైబర్ల సంఖ్య

- ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి 6.9 కోట్ల మంది అటల్ పెన్షన్ యోజన పథకం లబ్ధిదారులుగా మారారు.
- తక్కువ ఖర్చుతో పింఛను సదుపాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది
- ఈ పథకం లబ్ధిదారులకు 60 ఏళ్లు దాటాక నెలకు రూ.1000 నుంచి రూ.5 వేల వరకూ పెన్షన్ అందుతుంది.
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

# మౌనంగానే వ్యూహ రచన



- తన వ్యవసాయ క్షేత్రంలోనే సేద తీరుతున్న కేసీఆర్
- అడపాదడపా పార్టీ నేతలను కలుస్తున్నారు.
- కానీ, రాజకీయంగా ఆయన బయటకు వచ్చి చాలా రోజులైంది
- గులాబీ శ్రేణులను, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు నిరుత్సాహపరుస్తోంది
- తెలంగాణ రాజకీయం మరోసారి రగులుతోంది. అధికారపక్షంతో నువ్వా? నేనా? అన్నట్టుగా తలపడుతోంది

హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత.. తుంటి ఎముకకు గాయం కావడం ఆయణ్ని మరింత నీరసించేలా చేసింది. ఎంపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా? ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సెషన్‌కు తొలిరోజు హాజరైనా? ఆయన మునుపటిలా యాక్టివ్‌గా లేరు. తన వ్యవసాయ క్షేత్రంలోనే సేద తీరుతున్న కేసీఆర్, అడపాదడపా పార్టీ నేతలను కలుస్తున్నారు. కానీ, రాజకీయంగా ఆయన బయటకు వచ్చి చాలా రోజులైంది. ఇప్పుడిదే అంశం.. గులాబీ శ్రేణులను, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు నిరుత్సాహపరుస్తోంది. ఇన్నాళ్లూ ఎలా ఉన్నా? ఇప్పుడు తెలంగాణ రాజకీయం మరోసారి రగులుతోంది. అధికారపక్షంతో నువ్వా? నేనా? అన్నట్టుగా తలపడుతోంది ప్రతిపక్ష బీఆర్ఎస్. ఎమ్మెల్యేల ఫిరాయింపుల నుంచి, పీఏసీ చైర్మన్ పదవి వివాదాస్పదం అవడం దాకా?. రుణమాఫీ నుంచి సెక్రటేరియట్ ముందు రాజీవ్ విగ్రహ - మిగతా3లో



# కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- అమృత్ పథకం అక్రమాలపై ఫిర్యాదు చేస్తే కేంద్రం విచారిస్తుంది
- కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కోరుకుపోయింది
- కొంతమంది కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారు
- ఎంఐఎం పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతుంది
- హైడ్రాకి వ్యతిరేకం కాదని నిస్పాక్షికంగా కూల్చివేతలు జరగాలి
- తానెప్పుడు మదర్సాల గురించి మాట్లాడినా ఓవైసీ తెగ బాధపడిపోతారు
- ఉగ్రవాదులతో సంబంధమున్న ఓ టెర్రరిస్టు ఓవైసీ కాలేజీలో ఫ్యాకల్టీగా పనిచేస్తూ దొరికింది నిజం కాదా?

కరీంనగర్ /హైదరాబాద్

అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంన గర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర - మిగతా3లో

# నాలుగు రోజులు భారీ వర్షాలు..

### ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ

### పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశాలు

హైదరాబాద్

తెలంగాణలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యా



# సింగరేణి కార్మికులకు ఇచ్చింది బోనస్ కాదు.. బోగస్

- కార్మికుల కష్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుంది
- పండుగ వేళ.. ప్రభుత్వం కార్మికుల పొట్ట కొడుతోంది
- ప్రతి కార్మికుడికి 3.70 లక్షల రూపాయలు రావాలి
- కానీ కేవలం 796 కోట్ల రూపాయలు మాత్రమే కార్మికులకు పంచుతున్నారు.'
- సింగరేణి ప్రాంతంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన కార్మిక లోకానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బహుమానమా ఇది
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం



హైదరాబాద్

నిన్న సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చింది దసరా బోనస్ కాదు అది బోగస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కార్మికుల కష్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని మండిపడ్డారు. పండుగ వేళ.. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కేటీఆర్ మాట్లాడారు. సింగరేణి లాభాల బోనస్ అంతా బోగస్‌గా మారిపోయిందని అన్నారు. ప్రతి సింగరేణి కార్మికుడు కనీసం లక్షా 80వేలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ' సింగరేణి నికర 1,551 కోట్లు కావాలి.. ప్రతి కార్మికుడికి 3.70 లక్షల రూపాయలు రావాలి. కానీ కేవలం 796 కోట్ల రూపాయలు మాత్రమే కార్మికులకు పంచుతున్నారు.' అని వివరించారు. ఇస్తే మొత్తంగా లాభాల్లో వాటా ఇవ్వాలి, లేకపోతే మేము ఇచ్చేది కేవలం 16.9% మాత్రమే అని ఒప్పుకోవాలని

# నెయ్యి సరఫరాదారులపై చర్యలకు సిద్ధం





**విజయవాడ :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల్లో జంతువుల కొవ్వుల అవశేషాలు వెలుగు చూశాయని, అక్రమాలు జరిగాయంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల క్రితం ఎన్డీఏ వంద రోజుల పాలన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తీవ్ర ఆరోపణలు చేశారు. టీటీడీకి సరఫరా అవుతున్న నెయ్యి నాణ్యతపై నిర్వహించిన పరీక్షల్లో దిగ్భ్రాంతి పరిచే వాస్తవాలు వెలుగు చూసినట్టు గురువారం టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి నివేదికలను విడుదల చేశారు.జూలై నెల మొదటి వారంలో తిరుమలలో సేకరించిన నెయ్యి శాంపిల్స్ ఆధారంగా గుజరాత్‌కు చెందిన నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ అనుబంధ కాఫ్‌లో తిరుమలలో సేకరించిన నెయ్యి పరీక్షలు జరిపారు. దీనిపై కలవరపెట్టే విషయాలు వెలుగు చూశాయి. నెయ్యి తయారీకీ అవసరమైన ఎస్ వాల్యూ 95.8-104.32 శాతం మధ్య ఉండాల్సి ఉండగా టీటీడీ నుంచి సేకరించిన శాంపిల్స్‌లో 20శాతం లోపే ఉంది. జూలైలోనే ఈ నివేదిక టీటీడీకి అందింది. దీని ఆధారంగా నెయ్యి సరఫరాదారులపై టీటీడీ చర్యలు కూడా తీసుకున్నట్టు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కర్ణాటక నుంచి నందిని డైరీ నుంచి నెయ్యి సరఫరాను పునరుద్ధరించారు.ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీలో వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వుతో పాటు, ఇతర మార్గాల్లో కల్తీ జరిగిందని స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా టీటీడీకి ప్రైవేట్ సంస్థలతో పాటు, సహకార రంగంలో ఉన్న డైరీలు అందిస్తున్న నెయ్యి ధరలను చూస్తే ఆ ధరలతో నెయ్యి సరఫరా ఎలా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం తిరుమలకు సరఫరా చేస్తున్న నెయ్యిని రూ.470 కు నుంచి కొనుగోలు చేస్తున్నారు. టెండర్లలో ఎల్1గా నిలచిన కంపెనీల నుంచి ఎలాంటి పరీక్షలు లేకుండా నేతిని టీటీడీ కొనుగోలు చేస్తోంది. టెండర్ దక్కించుకున్న సంస్థలు ఇతర ప్రాంతాల నుంచి సేకరించి వాటిని టీటీడీకీ సరఫరా చేస్తున్నట్టు ప్రైవేట్ డైరీ సంస్థలు చెబుతున్నాయి. కొన్నేళ్ల క్రితం విజయవాడ నుంచి ట్యాంకర్లలో నకిలీ నెయ్యిని తిరుమలకు సరఫరా చేస్తుండగా టీటీడీ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అప్పట్లో ఈ వ్యవహారాన్ని గుట్టు చప్పుడు కాకుండా మాఫీ చేశారు.సాధారణంగా ఆవు నెయ్యిని తయారు చేయాలంటే కిలో నెయ్యి తయారీకి 25 లీటర్ల నుంచి 40 లీటర్ల వరకు పాలు అవసరం అవుతాయి. పాలలో ఉండే వెన్న శాతం ఆధారంగా వెన్న లభ్యత ఉంటుంది. ఆవు పాలలో నెయ్యి శాతం గరిష్టంగా 4- 6 శాతానికి మించి ఉండే అవకాశాలు ఉండవు. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక మినహా మిగిలిన రాష్ట్రాల్లో ఆవుల పెంపకం పెద్దగా ఉండదు. ఏపీలో చిత్తూరు, రాయలసీమ జిల్లాలో కూడా ఆవుల పెంపకం ఉంది. టీటీడీ రోజువారీ అవసరాలతో పాటు లడ్డూ ప్రసాదాల తయారీకి టన్నుల కొద్ది నెయ్యిని వినియోగిస్తారు.దేశీయ పద్ధతుల్లో శుద్ధమైన ఆవు నెయ్యిని తయారు చేయాలంటే కిలో నెయ్యికి లీటరు ఆవుపాలను లీటరుకు రూ.65రుపాయలకు కొనుగోలు చేస్తే రూ. 1625 నుంచి రూ.2275 ఉత్పత్తి వ్యయం అవుతుంది. ఒక్కోసారి కిలో నెయ్యి తయారీకి 40లీటర్ల పాలు కూడా అవసరం అవుతాయని డైరీ నిర్వాహకులు చెబుతున్నారు. పాల సేకరణ, వెన్నను తీసి, నెయ్యి తయారు చేసే క్రమంలో ఉత్పత్తి దారుడికి అయ్యే ఖర్చును కలుపుకుంటే లీటరు ధర వెన్న శాతం ఆధారంగా కిలో నెయ్యి ధర రూ.2వేలకు తక్కువ ఉండదు. అత్యంత ఖరీదైన ఆవు నెయ్యిని ఎల్1 టెండర్‌లో గత ప్రభుత్వ హయంలో సగటున రూ.400కు కేటాయించారు. ప్రస్తుతం నందిని సంస్థ నుంచి రూ.470 కొనుగోలు చేస్తున్నారు. అంత ఖరీదైన ఆవునెయ్యిని టన్నులకు టన్నులు టీటీడీకి రూ.450-500 ఎలా సరఫరా చేయగలుగుతారనే ప్రశ్నకు సహేతుకమైన సమాధానాలు ఎవరి వద్ద లేవు. సీఎం ఆరోపణల నేపథ్యంలో టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇచ్చిన వివరణలో కూడా కొన్ని వివరాలు బయటపెట్టారు. శ్రీవారి నైవేధ్యాల కోసం నిత్యం 60కేజీల స్వచ్ఛమైన నెయ్యిని దాతల సహకారంతో గుజరాత్, రాష్ట్రాల్లోని గోశాల నుంచి లక్ష రుపాయల వ్యయంతో కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. రోజుకు 60కిలోలను లక్ష రుపాయల చొప్పున నెలకు రూ.30లక్షలు ఖర్చు చేస్తున్నట్టు సుబ్బారెడ్డి స్వయంగా వెల్లడించారు. ఆ లెక్కల్లో కిలో ధర రూ.1667 పలుకుంది. స్వామి వారి నైవేధ్యానికి వినియోగించే నెయ్యి ధర రూ.1667 ఉన్నపుడు, లడ్డూ ప్రసాదాలకు వాడే నెయ్యి కిలో రూ.470కు ఎలా వస్తుందనేది మరో ప్రశ్న. స్వామి వారి నైవేద్యంలలో వాడే నెయ్యి, ప్రసాదాల్లో వాడే నెయ్యి ఒక్కటి కాదని వైవీ సుబ్బారెడ్డి స్వయంగా అంగీకరించినట్టైంది.వైసీపీ ప్రభుత్వంలో ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసే నెయ్యిని ట్యాంకర్లలో సరఫరా చేస్తే కిలో రూ.390కు, 15లీటర్ల క్యాన్లలో కొనుగోలు చేస్తే రూ.409 చొప్పున సేకరించారు. సగటున రూ.400 చొప్పున కిలో నెయ్యి కొనుగోలు చేశారు.గత ఏడాది టీటీడీ నెయ్యి కొనుగోళ్ల కోసం రూ.207 కోట్లన ఖర్చు చేసింది. కిలో రూ.400చొప్పున ఏడాదిలో దాదాపు 51,75,000 కేజీల నెయ్యిని పలు సంస్థల నుంచి కొనుగోలు చేశారు. అంటే సగటున రోజుకు 14,178కేజీల నెయ్యిని ప్రసాదాల తయారీలో వినియోగించారు. ఇందుకోసం 5175 టన్నుల నెయ్యిని రూ.207 కోట్లను టీటీడీ వెచ్చించింది. టీటీడీకి సరఫరా చేసే నెయ్యి కల్తీ వ్యవహారంలో పైకి కనిపించని కోణాలు చాలా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దేశంలో స్వచ్ఛమైన ఆవు నెయ్యి లభ్యత అంత సులువు కాదని డైరీ రంగంలో పనిచేసే వారు చెప్పే మాట... రాయలసీమలో ఆవుల ద్వారా పాడిపరిశ్రమ నిర్వహించే డైరీ నిర్వాహకులు గతంలో టీటీడీని నెయ్యి సరఫరాకు సంప్రదించినా అప్పట్లో తమకు అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారుదేశంలో కర్ణాటక డైరీ ఫెడరేషన్‌తో పాటు కొన్ని ప్రైవేట్ సంస్థలు మాత్రమే ఆవుపాలను సేకరించి ఉత్పత్తులు చేస్తున్నాయి. 4 నుంచి 6శాతం మాత్రమే కొవ్వు ఉండే ఆవు పాల నుంచి నెయి తీయాలంటే 15 టన్నుల నెయ్యి కోసం 6 లక్షల లీటర్ల పాలు వాడాల్సి ఉంటుందని డైరీ నిర్వాహకులు చెబుతున్నారు. అంటే సగటున ప్రతి కిలో నెయ్యికి 40లీటర్ల పాలు వినియోగించాల్సి ఉంటుంది. టీటీడీ లడ్డూ ప్రసాదాల కోసం కొనే నెయ్యిలో ఖచ్చితంగా కల్తీ జరగడానికి అవకాశం ఉంటుందని చిత్తూరుకు చెందిన ప్రైవేట్ డైరీ నిర్వాహకుడు వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలపై చేసిన వ్యాఖ్యల్లో లాభనష్టాలపై కూడా విస్తృత చర్చ జరుగుతోంది. రాజకీయ కోణంలో చూస్తే గత ప్రభుత్వాల హయంలో జరిగిన పొరపాట్లు తమకు చుట్టుకోకుండా చంద్రబాబు జాగ్రత్తపడ్డారనే వాదనలు ఉన్నా, అంతకు మించి భక్తుల మనస్సులో సందేహాలను నాటాయి. ఇకపై తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను భక్తులు అనుమానపు చూపులు చూసే ప్రమాదం ఉంటుంది. ఆవుకొవ్వు, పందికొవ్వు అంటూ రాజకీయ వ్యాఖ్యలు స్వామి వారి లడ్డూ ప్రసాదాలపై సామాన్య ప్రజల్లో ఉండే భక్తిభావంపై ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు. మరోవైపు గుజరాత్ ల్యాబరేటరీ రిపోర్టులను బయటపెట్టకపోతే భవిష్యత్తులో వైసీపీ వాటినే తమపై ప్రయోగించి ఉండేదనే అనుమానం టీడీపీ వర్గాల్లో ఉంది. కోట్లాది మంది భక్తుల కొలిచే కలియుగ ప్రత్యక్ష దైవం చుట్టూ ఏపీలో జరుగుతున్న రాజకీయం భక్తుల మనోభావాలతో సంబంధం లేకుండా సాగుతోంది.తిరుమల వెళ్లిన భక్తుల్ని ఇతరులు దేవుడి కంటే ముందు లడ్డూ ప్రసాదం గురించే అడుగుతారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన తప్పుల్ని ఎత్తి చూపడానికి ఉపయోగపడినా భక్తుల హృదయాల్లో అంతకుమించి అనుమానపు బీజాలు నెలకొల్పడానికి ముఖ్యమంత్రి వ్యాఖ్యలు కారణమవుతాయనే అభిప్రాయం ఉంది.

# ఆర్మీ ప్రత్యేక రైలుని పేల్చివేసే కుట్ర... ట్రాక్‌పై 10 డిటోనేటర్ల గుర్తింపు

**మధ్యప్రదేశ్‌లో వెలుగుచూసిన షాకింగ్ ఘటన**

**ఆర్మీ సిబ్బంది ప్రయాణించిన రైలును లక్ష్యం ఎంచుకున్న దుండగులు**

**ఉత్తరప్రదేశ్‌లో రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్ గుర్తింపు**

**వరుసగా వెలుగుచూస్తున్న కుట్రలు**



దేశంలో ఇటీవల రైలు ప్రమాదాలకు కుట్రలు పన్నుతున్నట్టు అనుమానాలు కలిగించేలా వరుస ఘటనలు వెలుగుచూ స్తున్నాయి. తాజాగా దిగ్భ్రాంతి కలుగజేసే మరో పన్నాగం బయటపడింది. ఆర్మీ సిబ్బందితో వెళుతున్న ప్రత్యేక రైలును పేల్చివేసే కుట్ర జరిగింది. రైల్వే ట్రాక్‌పై ఏకంగా 10 డిటోనేటర్లను దుండగులు అమర్చారు. అయితే అదృష్టం కొద్దీ ఎలాంటి నష్టం జరగకుండానే కుట్రం భగ్నమైంది. మధ్యప్రదే శ్‌లోని బుర్హాన్‌పూర్ జిల్లాలో బుధవారం ఈ ఘటన జరిగింది. సైన్యానికి చెందిన ప్రత్యేక రైలు జమ్మూ కశ్మీర్ నుంచి కర్ణాటకకు వెళుతున్న సమయంలో సగ్‌ఫటా రైల్వే స్టేషన్ సమీపంలో డిటోనేటర్లను గుర్తించారు. ఒక డిటోనేటర్ పేలడంతో డ్రైవర్ వెంటనే అప్రమత్తమై ట్రైన్‌ను ఆపాడు. దీంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవర్ వెంటనే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించాడు. యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), రైల్వే, స్థానిక పోలీసు సీనియర్ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. ఈ ఘటనపై దర్యాప్తు మొదలుపెట్టారు. కాగా ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు తెలిపారు.

**రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్**

ఉత్తరప్రదేశ్‌లో ఒక చోట రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్‌ను రైల్వే భద్రతా సిబ్బంది గుర్తించారు. ఇవాళ (ఆదివారం) తెల్లవారుజామున రాష్ట్రంలోని కాన్పూర్‌లో ఉన్న ప్రేమ్‌పూర్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో రైలు పట్టాలపై ఈ సిలిండర్‌ను గుర్తించారు. అది ఖాళీ గ్యాస్ సిలిండర్ అని నిర్ధారించారు. ట్రాక్‌పై సిలిండర్‌ను గుర్తించిన వెంటనే గూడ్స్ రైలు లోకో పైలట్ అత్యవసర బ్రేకులు వేసి ట్రైన్‌ను ఆపాడు. ఉదయం 8:10 గంటల సమయంలో ట్రైన్ కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్ వైపు వెళుతున్న సమయంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు వెల్లడించారు. 5 కేజీల గ్యాస్ సిలిండర్‌ను ట్రాక్‌పై ఉంచారని, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. కాగా ఉత్తరప్రదేశ్‌లో ఈ తరహా ఘటన జరగడం ఈ నెలలో రెండవసారి కావడం గమనార్హం.

## నన్ను అవినీతిపరుడిగా నిరూపించేందుకు మోదీ కుట్ర పన్నారు

**న్యూఢిల్లీ:** తనను అవినీతిపరుడిగా నిరూపించేందుకు ప్రధాని మోదీ కుట్ర పన్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని మోదీ భావించారంటూ మండిపడ్డారు. ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన 'జనతాకీ అదాలత్' కార్యక్రమంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. 'ప్రధాని నరేంద్ర మోదీ మాపై కుట్ర పన్నారు. నన్ను, (ఆప్ నేత) మనీష్ సిసోడియా అవినీతిపరుడని నిరూపించేందుకు కుట్ర పన్నారు. మా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించారు' అని అన్నారు. కాగా, తాను గత పదేళ్లుగా నిజాయితీతో ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపానని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని ప్రధాని మోదీ భావించారని విమర్శించారు. 'సీఎం కుర్చీపై ఆకలి లేకపోవడం వల్లే రాజీనామా చేశా. డబ్బు సంపాదించడానికి కాదు, దేశ రాజకీయాలను మార్చేందుకే వచ్చా' అని అన్నారు. సీఎం పదవికి రాజీనామా చేసిన తాను మరికొద్ది రోజుల్లో సీఎం అధికార నివాసం నుంచి వెళ్లిపోతానని తెలిపారు. పదేళ్లపాటు సీఎంగా ఉండి కూడా ఢిల్లీలో తనకు సొంత ఇల్లు లేదన్నారు. మరోవైపు బీజేపీ తనను అవినీతిపరుడని అనడంతో బాధపడ్డానని కేజ్రీవాల్ ఆవేదన వ్యక్తం చేశారు. 'అరవింద్ కేజ్రీవాల్ నిజాయితీ లేనివాడైతే ప్రజలకు ఉచిత విద్యుత్తు, మహిళలకు బస్సు చార్జీలు ఉచితంగా ఇచ్చేవాడా? పిల్లల కోసం స్కూళ్లు కట్టించేవాడా? ఆసుపత్రుల్లో వైద్యం ఉచితంగా అందించేవాడా? ' అని ప్రశ్నించారు.

## ఆ ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాల్లో నెల వేతనం జమ



కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించినట్టుగానే కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి ఒక నెల వేతనాన్ని వారి ఈపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నట్టు కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఆ ప్రకారం ఒక ఉద్యోగి ఖాతాలో గరిష్ఠంగా రూ.15 వేలు జమకానున్నాయి. ఇక తెలంగాణలో 36,018 సంస్థల కింద 47.96 లక్షల మంది చందాదారులు, 4.54 లక్షల మంది పెన్షన్ తీసుకునేవాళ్లు ఉన్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. కేంద్రమంత్రి మాండవీయ హైదరాబాద్ బర్కత్‌పురాలోని పీఎఫ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌పై మన్‌సుఖ్ మాండవీయ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈపీఎఫ్ తెలంగాణ జోన్‌లో ఏటా రూ.7,797 కోట్ల చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. యువ ఉద్యోగుల కోసం కేంద్రప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాన్ని ప్రకటించిందని గుర్తుచేశారు. ఈ పథకం కింద మొదటిసారి ఉద్యోగంలో చేరే యువతీ యువకులకు ఒక నెల వేతనాన్ని ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించనుంది.

## 'కొడుకు ఫీజు చెల్లించడానికి అడుక్కోవలసి వచ్చింది' మనీష్ సిసోడియా ఆవేదన



**న్యూఢిల్లీ:** తన కొడుకు కాలేజీ ఫీజు చెల్లించడానికి సహాయం కోసం తాను అడుక్కోవలసి వచ్చిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సీనియర్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా వాపోయారు. తన బ్యాంకు ఖాతాలో పది లక్షలు ఉన్నప్పటికీ ఈడీ ఫ్రీజ్ చేయడంతో ఈ దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జంతర్ మంతర్ వద్ద జరిగిన 'జనతా కీ అదాలత్' సభలో మనీష్ సిసోడియా మాట్లాడారు. మద్యం పాలసీ కేసులో అరెస్ట్ చేసి ఏడాదిన్నరపాటు జైలులో ఉంచిన తనను అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. 'నన్ను విచ్ఛిన్నం చేయడానికి వారు ప్రయత్నించారు. అరవింద్ కేజ్రీవాల్ నన్ను ఇరికించారని నాకు చెప్పారు. మనీష్ సిసోడియా పేరును అరవింద్ కేజ్రీవాల్ చెప్పారని కోర్టుకు తెలిపారు. కేజ్రీవాల్ పేరు చెబితే మీరు బయటపడతారని జైలులో నాతో అన్నారు' అని మండిపడ్డారు. కాగా, బీజేపీలోకి మారడానికి తనకు చాలా ఆఫర్లు వచ్చాయని సిసోడియా తెలిపారు. పార్టీ మారకపోతే తనను జైలులో చంపేస్తారని కూడా బెదిరించారని ఆయన ఆరోపించారు. 'నా గురించి ఆలోచించమని, రాజకీయాల్లో ఎవరూ ఎవరి గురించి ఆలోచించరని నాకు చెప్పారు. నా కుటుంబం గురించి, అనారోగ్యంతో ఉన్న నా భార్య, కాలేజీలో చదువుతున్న నా కుమారుడి గురించి ఆలోచించమని నాకు చెప్పారు' అని విమర్శించారు. అయితే రాముడి నుంచి లక్ష్మణుడ్ని దూరం చేసేందుకు మీరు ప్రయత్నిస్తున్నారని, ప్రపంచంలో ఏ రావణుడికి ఇలా చేసే శక్తి లేదని తాను చెప్పానన్నారు. మరోవైపు 26 ఏళ్లుగా అరవింద్ కేజ్రీవాల్ తన సోదరుడు, రాజకీయ గురువు అని మనీష్ సిసోడియా అన్నారు. ఆప్‌ను విచ్ఛిన్నం చేసేందుకే తనను, పార్టీ సహచరులను అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. అయితే తమతోపాటు పార్టీని కూడా వారు విచ్ఛిన్నం చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. అరవింద్ కేజ్రీవాల్ మాదిరిగానే తాను కూడా ఎన్నికల్లో ప్రజా తీర్పు తర్వాతే ఢిల్లీ ప్రభుత్వంలో బాధ్యతలు చేపడతానని సిసోడియా స్పష్టం చేశారు.

## దాదాపు 7 కోట్లకు చేరిన అటల్ పెన్షన్ యోజన సబ్‌స్క్రైబర్ల సంఖ్య



ఇంటర్నెట్ డెస్క్: వృద్ధాప్యంలో ఆర్థికంగా ఆసరా ఇచ్చే అటల్ పెన్షన్ యోజన పథకం సబ్‌స్క్రైబర్ల సంఖ్య 6.9 కోట్లుకు చేరినట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా పేర్కొన్నారు. పెన్షన్ ఫండ్ నిధి రూ.35,149 కోట్లుగా ఉన్నట్టు వెల్లడించారు. "2015లో ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి 6.9 కోట్ల మంది అటల్ పెన్షన్ యోజన పథకం లబ్ధిదారులుగా మారారు. పెన్షన్ ఫండ్ రూ.35,149కి చేరింది" అని ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం ప్రారంభోత్సవంలో మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

తక్కువ ఖర్చుతో పింఛను సదుపాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం లబ్ధిదారులకు 60 ఏళ్లు దాటాక నెలకు రూ.1000 నుంచి రూ.5 వేల వరకూ పెన్షన్ అందుతుంది. లబ్ధిదారులు పథకంలో పెట్టిన పెట్టుబడిని బట్టి వచ్చే పింఛను ఆధార పడి ఉంటుంది. పెన్షన్ సబ్‌స్క్రైబర్ మరణించిన పక్షంలో వారి భాగస్వామికి ఈ పింఛను అందజేస్తారు. సబ్‌స్క్రైబర్‌తో పాటు వారి జీవితభాగస్వామి కూడా మరణిస్తే వారి సంతానానికి పెన్షన్ కార్పస్‌ను పూర్తిగా అందజేస్తారు.

## 'దేశంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి'



**లక్నో:** దేశంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. అలాగే మహిళల భద్రత పట్ల ప్రభుత్వ విధానాలను ఆమె ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్, బెంగాల్, ఒడిశా, కర్ణాటక సహా దేశ వ్యాప్తంగా మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని మాయావతి ట్వీట్ చేశారు. అయితే పెరుగుతున్న నేరాల సంఘటనలపై ప్రత్యారోపణలతో సంకుచిత రాజకీయాలకు పాల్పడడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మహిళల భద్రత, గౌరవానికి సంబంధించి ప్రభుత్వాల ఉద్దేశాలు, విధానాల్లో తీవ్ర లోపం ఉన్నదా? అని ప్రశ్నించారు. అలా అయితే దీని గురించి తీవ్రంగా ఆలోచించాల్సిన సమయం ఇదేనని ఎక్స్‌లో ఆదివారం పోస్ట్ చేశారు. కాగా, మహిళలపై నేరాల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం, పోలీసుల ప్రమేయం పరిస్థితిని మరింత తీవ్రంగా మారుస్తున్నదని మాయావతి విమర్శించారు. ఈ నిర్లక్ష్యాన్ని విడిచిపెట్టాలని, నిష్పక్షపాతంగా, సీరియస్‌గా వ్యవహరించడం ప్రతి ఒక్కరికీ చాలా ముఖ్యమని సూచించారు. తద్వారా ఇలాంటి ఘోరమైన నేరాల వల్ల రాష్ట్రం, దేశం అపఖ్యాతి కాకుండా కాపాడుకోవచ్చని వరుస ట్వీట్లలో పేర్కొన్నారు.

## పాక్‌తో చర్చల ప్రసక్తి లేదు



**రాజౌరి:** ఉగ్రవాదాన్ని అంతమొందించేంత వరకూ పాకిస్థాన్‌తో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. నేషనల్ కాంగ్రెస్ కాంగ్రెస్ సహా వివిధ విపక్షాలు డిమాండ్ చేస్తున్నట్టుగా 370 అధికరణ రద్దును తిరిగి పునరుద్ధరించేది లేదన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నౌషెరాలో ఆదివారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా మాట్లాడారు. "370వ అధికరణను తిరిగి తెస్తామని ఫరూక్ అబ్దుల్లా చెబుతున్నారు. ఫరూక్ సాహెబ్.. 370 అధికరణను ఎవరూ వెనక్కి తేలేరు. ఇప్పుడు బంకర్లు అవసరం లేదు. బుల్లెట్లు కాల్చడానికి ఎవరికీ దమ్ము సరిపోదు" అని అమిత్‌షా అన్నారు. షేక్ అబ్దుల్లా జెండాను తిరిగి తేవాలని వారనుకుంటున్నారని, కానీ జమ్మూకశ్మీర్‌లో ఎగిరేది మన త్రివర్ణ పతాకం మాత్రమేనని స్పష్టం చేశారు. 30 ఏళ్లుగా ఉగ్రవాదం కొనసాగుతోందని, 30 ఏళ్లలో 3000 రోజులు జమ్మూలో కర్ఫ్యూ విధించారని, 40 వేల మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మళ్లీ ఆ రోజులు ఎలా తేవాలనుకుంటున్నారో ఫరూక్ అబ్దుల్లానే చెప్పాలని అన్నారు. జమ్మూకశ్మీర్ తగలబడుతుంటే ఫరూక్ అబ్దుల్లా మాత్రం లండన్‌లో హాలిడేస్ గడిపారంటూ అమిత్‌షా విమర్శలు గుప్పించారు.

"పాకిస్థాన్‌తో చర్చలు జరపాలని వాళ్లు అంటున్నారు. అయితే ఉగ్రవాదం అంతమొందేంత వరకూ చర్చలు కుదరదని మేము అంటున్నాం. జైళ్ల నుంచి ఉగ్రవాదులను విడిచిపెట్టాలని వారు కోరుకుంటున్నారు. ఏ ఒక్క ఉగ్రవాదని కానీ, రాళ్లు రువ్వే వాళ్లను కానీ జైళ్ల నుంచి విడిచిపెట్టేది లేదు. బీజేపీ ఇందుకు హామీగా ఉంటుంది" అని అమిత్‌షా స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఎన్‌సీ, పీడీపీలు గత 70 ఏళ్లుగా కొండ ప్రాంతాలలో ఉండేవారికి రిజర్వేషన్ హక్కులు లేకుండా చేసిందని, మోదీ మాత్రం కొండ ప్రాంతాల ప్రజలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో తొలి విడత పోలింగ్ సెప్టెంబర్ 18న జరుగగా, 61.13 శాతం పోలింగ్ నమోదైంది. రెండో విడత పోలింగ్ ఈనెల 25న జరుగనుండగా, అక్టోబర్ 5న జరిగే మూడో విడతతో పోలింగ్ ముగుస్తుంది. అక్టోబర్ 8న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# పేదలకు తీపికబురు

-మొదటిపేజీ తరువాయి

అందించడమే కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంది. ఇదే క్రమంలో తాజాగా ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరించిన క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పైన తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఇందిరమ్మ ఇళ్ళ విషయంలో తెలంగాణా ప్రభుత్వ నిర్ణయం ఇందిరమ్మ పథకం ద్వారా నిరుపేదలకు ఇల్లు ఇచ్చే విషయం పైన మరో 10, 15రోజులలో కీలక ఆదేశాలు వెలువడే అవకాశం ఉందని సమాచారం. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్రం అందించే ప్రధానమంత్రి ఆవాస యోజన పథకాన్ని కూడా అనుసంధానించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇక దీనితో ఇటు రాష్ట్రప్రభుత్వం నుంచి అందే నిధులే కాకుండా, కేంద్రం నుంచి కూడా నిరుపేదలకు ఇళ్ళ నిర్మాణానికి కావలసిన నిధులు అందుతాయి. ఇందిరమ్మ ఇళ్ళ పథకం విధి విధానాలు, మార్గదర్శకాలపై కసరత్తు తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయాలన్న క్రమంలో ఇతర



రాష్ట్రాల్లో అమలవుతున్న హౌసింగ్ స్కీమ్ మార్గదర్శకాలు, విధివిధానాలు ఏ విధంగా ఉన్నాయి అన్న దానిపైన తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ కొద్ది రోజుల క్రితం అధ్యయనం చేసింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాలలో అధికారుల బృందాలు పర్యటించి అక్కడ అమలవుతున్న విధానాలను పరిశీలించారు. ఇందిరమ్మ పథకం అమలుకు ప్రత్యేక యాప్ అర్హుల ఎంపికకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి కూడా సమర్పించారు. ఈ క్రమంలోనే అర్హుల ఎంపిక చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టిన తర్వాత అర్హులను ఎంపిక చేయాలని భావిస్తోంది. అత్యంత పారదర్శకంగా అర్హుల ఎంపిక ప్రక్రియ ఉండాలని భావిస్తున్న తెలంగాణ సర్కార్ ఈ స్కీంను అమలు చేయడం కోసం ప్రత్యేకంగా ఒక యాప్ ని కూడా అందుబాటులోకి తీసుకురావాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. తెలంగాణా ప్రజలకు మళ్ళీ శుభవార్త చెప్పేందుకు రేవంత్ సర్కార్ రెడీ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తామని చెప్పిన తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 11వ తేదీన భద్రాచలం వేదికగా ఈ స్కీంను ప్రారంభించారు . మొత్తం తెలంగాణ రాష్ట్రంలో 22,500 కోట్ల బడ్జెట్ తో నాలుగున్నర లక్షల ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ ప్రక్రియలో జాప్యం జరిగింది. మళ్లీ ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రజలకు శుభవార్త చెప్పడానికి రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమైంది.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

-మొదటిపేజీ తరువాయి

అధ్యక్షుడు కిషన్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. అమృత్ పథకం అక్రమాలపై ఫిర్యాదు చేస్తే కేంద్రం విచారిస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కోరుకుపోయిందని, కొంతమంది కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎంఐఎం పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతుందన్నారు. హైడ్రాకి వ్యతిరేకం కాదని నిస్పాక్షికంగా కూల్చివేతలు జరగాలన్నారు. తిరుమల లడ్డు కల్తీ వివాదంపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా దృష్టి సారించారని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

**ఓవైసీ బ్రదర్స్‌పై బండి సంచలన వ్యాఖ్యలు**

ఓవైసీ బ్రదర్స్‌కు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయని కేంద్ర సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓల్డ్ సిటీ ఓవైసీ కనుసన్నల్లో ఉగ్రవాదుల అడ్డాగా మారిందని ఆరోపించారు. బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా కరీంనగర్‌లో సంజయ్ ఆదివారం మాట్లాడారు. ఎంఐఎం పార్టీ మీటింగ్‌లో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ శనివారం మాట్లాడుతూ.. బండి సంజయ్‌కు ఇస్లామోఫోబియా పట్టుకుందని, అందుకే మదర్సాలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని అన్నారు. ఈ వ్యాఖ్యలకు బండి కౌంటర్ ఇచ్చారు.

**ఆయనది హిందూ ఫోబియా..**

తనకు ఇస్లామోఫోబియా లేదనీ, ఓవైసీ మాత్రం హిందూ ఫోబియాతో ఇబ్బంది పడుతున్నాడని సంజయ్ విమర్శించారు. పోలీసులను తీసేసి తనకు 15 నిమిషాలు టైమిస్తే, దేశంలోని



హిందువులందరినీ నరికి చంపేస్తానని అన్న వ్యక్తికి హిందూఫోబియా ఉన్నట్లేగా? అని అన్నారు. ఓవైసీ సోదరులు, ఎంఐఎం నేతలు, కార్యకర్తలు ఎన్నడూ వందేమాతర గేయాన్ని ఆలపించలేదని, ఏ ఫోబియా వాళ్లను ఆపుతుందో చెప్పాలన్నారు. హిందువులు లౌకిక విలువలను పాటిస్తూ పీర్ల పండగ జరుపుకుంటారని.. ఏనాడైనా ఓవైసీ హిందువుల పండగల్లో పాల్గొన్నారా? బొట్టు పెట్టుకుని హిందూ దేవతలకు నమస్కరించారా? అని ప్రశ్నించారు.

**ఉగ్రవాద ఫ్యాక్టరీలవి..**


తానెప్పుడు మదర్సాల గురించి మాట్లాడినా ఓవైసీ తెగ బాధపడిపోతారని, ఉగ్రవాదులతో సంబంధమున్న ఓ టెర్రరిస్టు ఓవైసీ కాలేజీలో ఫ్యాకల్టీగా పనిచేస్తూ దొరికింది నిజం కాదా అని బండి ప్రశ్నించారు. "ఉత్తరప్రదేశ్‌లోని బిజ్‌నోర్ మదర్సాలో 9 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి దగ్గర మారణాయుధాలు దొరికాయి. అలాంటప్పుడు మదర్సాలు టెర్రరిస్టులను తయారు చేస్తున్నాయని అంటే ఓవైసీకి వచ్చిన బాధేంటి. దేశంలో ఎక్కడ ఉగ్రవాదులు పట్టుబడ్డా వారిలో కచ్చితంగా ఒక్కరికైనా పాత బస్తీతో సంబంధాలు ఉంటున్నాయి. ఓటు బ్యాంకు రాజకీయం కోసం ఉగ్రవాదులకు, రోహింగ్యాలకు ఎంఐఎం నేతలు ఆధార్, రేషన్ కార్డులిప్పించి ఆశ్రయం కల్పిస్తున్న మాట నిజం కాదా?. ప్రస్తుతం పాత బస్తీలోని కొన్ని ముస్లిం వర్గాలు ఓవైసీ కుటుంబ నియంతృత్వ ధోరణితో విసిగిపోయాయి. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే ఓల్డ్ సిటీని, న్యూ సిటీగా మార్చుతాం. ఓవైసీ కుటుంబానికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి" అని బండి వ్యాఖ్యానించారు.

**హైడ్రాపై..**

భాగ్యనగరంలో సంచలనం సృష్టిస్తున్న హైడ్రాకు తాను వ్యతిరేకం కాదని బండి స్పష్టం చేశారు. అక్రమ కట్టడాలకు కారణమైన బీఆర్ఎస్ నేతలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కూల్చివేతల విషయంలో రాజకీయ ప్రలోభాలు ఉండకూడదని.. అక్రమ నిర్మాణాలు ఏ పార్టీవారివైనా కూల్చాల్సిందేనని డిమాండ్ చేశారు. అమృత్ పథకం అక్రమాలపై ఫిర్యాదు చేస్తే కేంద్రం విచారిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ఓటుకు నోటుకు కేసు విచారణ జరపలేదని, దీనిని బట్టి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని బండి ఆరోపించారు.

# ప్రజలకు భారం కానున్న కరెంట్

**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక ఉచిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఫ్రీ బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే సిలిండర్ అమలు చేస్తోంది. రుణ మాఫీ చేసింది. దసరాకు రైతుభరోసా ఇచ్చే ఆలోచనలో ఉంది. అయితే తొలిసారి ప్రజలకు షాక్ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. విద్యుత్ చార్జీలు పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.తెలంగాణలో విద్యుత్ చార్జీలు పెరుగుతాయా అంటే అవుననే అంటున్నాయి విద్యుత్ పంపిణీ సంస్థలు. తమకు ఇప్పటికే భారీగా లోటు ఉందని, ఈ నేపథ్యంలో చార్జీలు పెంచక తప్పదని పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో 1,200 కోట్లు పూడ్చుకోవడానికి చార్జీలు పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాయి. గృహ విద్యుత్ 300 యూనిట్లు దాటితే స్థిర చార్జీ కిలోవాట్‌కు రూ.40 పెంచాలని కోరాయి. 2024?25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికను విద్యుత్ నియంత్రణ మండలికి సమర్పించాయి. మొత్త మూడు కేటగిరీల్లో విద్యుత్ చార్జీలను సవరించాలని ప్రతిపాదించాయి.తెలంగాణలో ఉత్తర, దక్షిణ డిస్కంలు ఈ ఏడాది తమ ఆదాయ, వ్యవయాల మధ్య ఉన్న లోటును వెల్లడించాయి. రెండు డిస్కంలకు కలిసి రూ.14,222 కోట్ల లోటు ఉందని అంచనా వేశాయి. ఈ



మొత్తం లోటులో రూ.13,022 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో సమకూర్చాలని కోరాయి. అవి పోగా మిగిలిన రూ.1,200 కోట్లుచార్జీల పెంపుద్వారా పూడ్చుకోవాలని ప్రతిపాదించాయి. అయితే భారం పేద, మధ్య తరగి గృహ వినియోగదారులపై పడే అవకాశం లేనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గృహ విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటితే.. కిలోవాట్‌కు స్థిర చార్జీ రూ.10 వసూలు చేస్తున్నారు. అయితే ఆ మొత్తాన్ని మరో రూ.40 పెంచి రూ.50 వసూలుకు అనుమతి ఇవ్వాలని డిస్కంలు ప్రతిపాదించాయి.ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం 200 యూనిట్ల విద్యుత్‌ను అర్హులకు ఉచితంగా ఇస్తోంది. ఇక 299 యూనిట్ల విద్యుత్ వాడే మధ్య తరగతి వారికి కూడా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా 300 యూనిట్లు దాటినవారిపైనే భారం వేయాలని డిస్కంలు ప్రతిపాదించాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.30 కోట్ల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 300 యూనిట్లకుపైగా విద్యుత్ వినియోగించే గృహ వినియోగదా రులు కేవలం 20 శాతమే. వారిపై మాత్రమే భారం పడే అవకాశం ఉందని తెలుస్తోంది. మిగతా 80 శాతం వినియోగ దారులపై ఎలాంటి భారం ఉండదని డిస్కంలు చెబుతున్నా యి. డిస్కంల ప్రతిపాదనపై రాష్ట్రంలో కనీసం మూడుచోట్ల బహిరంగ చర్చ చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా అభిప్రాయ సేకరణ చేసిన తర్వాతనే చార్జీల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత చార్జీల సవరణ అమలులోకి వస్తుంది. ఈ మొత్త ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం మూడు నెలలు పట్టే అవకాశం ఉంది.

# డాక్టర్ రాజయ్య కమిటీతో కేటీఆర్ భేటీ

**హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రజా ఆరోగ్య పరిస్థితుల అధ్యయనం కోసం పార్టీ తరపున నియమించిన త్రిసభ్య కమిటీతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను, సమస్యలను పరిశీలించేందుకు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే సంజయ్‌తో మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య నేతృత్వంలో కమిటీని నియమించిన విషయం తెలిసిందే. త్రిసభ్య కమిటీ నేటి నుంచే కార్యాచరణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. గాంధీ హాస్పిటల్‌లో మాతా శిశు మరణాలతో పాటు రాష్ట్రంలో నెలకొన్న దుర్భరమైన వైద్య ఆరోగ్య పరిస్థితుల పతనంపై ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. గాంధీతో పాటు రాష్ట్రంలోని పలు హాస్పిటళ్లను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి నిర్మాణాత్మకమైన సూచనలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించనుంది.



## నాలుగు రోజులు భారీ వర్షాలు

-మొదటిపేజీ తరువాయి

నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నాయని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాపాతం నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరిలో 10 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది. ఆ తర్వాత సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## సింగరేణి కార్మికులకు ఇచ్చింది బోనస్ కాదు.. బోగస్..

-మొదటిపేజీ తరువాయి



సింగరేణి కార్మికుల లాభాల వాటాపై అసత్యాలు చెప్పవద్దని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న మొత్తం పది సంవత్సరాల్లో కార్మికులకు లాభాల వాటా రూపంలో దక్కింది కేవలం 365 కోట్ల రూపాయలు మాత్రమేనని కేటీఆర్ తెలిపారు. కానీ భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్న పది సంవత్సరాల్లో లాభాల వాటా రూపంలో సింగరేణి కార్మికులకు అందించింది 2780 కోట్ల రూపాయలు అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో సింగరేణి అద్భుతమైన ప్రగతి సాధించిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సింగరేణి కార్మికులకు సంస్థ లాభాలు పది, పదిహేను శాతానికి మించి ఏనాడు ఇవ్వలేదని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత భారీగా లాభాలు పెరిగేలా సంస్థ పనితీరును పెంచామని.. ఒక్కొక్క కార్మికుడికి అత్యధికంగా 32% వాటా ఇచ్చామని చెప్పారు. మేము అధికారంలో వచ్చే నాటికి 17 వేల రూపాయల లాభాల వాటా ఉంటే, అధికారంలోకి దిగిపోయినప్పుడు లక్షా డెబ్బై వేల రూపాయల వరకు ప్రతి కార్మికుడికి లాభాల వాటా ఇచ్చామని తెలిపారు.

సింగరేణి ప్రాంతంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన కార్మిక లోకానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బహుమానమా ఇది అని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాన్ని గెలిపించినందుకు కార్మికుల పొట్టగొట్టడమా అని ప్రశ్నించారు. ప్రస్తుతం కార్మికుల హక్కులకు పూర్తిగా భంగం కలిగించేలా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని కార్మిక లోకానికి తాము ముందే హెచ్చరించామని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణి ప్రైవేటీకరిస్తుందని ముందే హెచ్చరించామని తెలిపారు. ఆ మేరకే కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణి గనుల వేలాన్ని నిర్వహించిందని పేర్కొన్నారు. బీజేపీ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి గారు వేలంలో నవ్వుతూ పాల్గొన్నారని తెలిపారు. లాభాల్లో కార్మికుల వాటా తగ్గించడం అంటే, భవిష్యత్తుతో సింగరేణి కార్మికుల ఆత్మస్థైర్యాన్ని, భాగస్వామ్యాన్ని తగ్గించి సింగరేణి ప్రైవేటీకరించే కుట్రగానే భావిస్తున్నామని కేటీఆర్ అన్నారు. సింగరేణి లాభాల వాటాపైన సింగరేణి కార్మికులు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. సింగరేణి ప్రాంతంలో గెలిచిన 13 మంది ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి దగ్గరికి పంపించాలని సూచించారు. సింగరేణి ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ అంశంలో స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికార గుర్తింపు సంఘంతో పాటు, కూనంనేని సాంబశివరావు, బీజేపీ నేతలు కూడా ఈ అంశంలో స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మా సింగరేణి బొగ్గు గని కార్మిక సంఘం ద్వారా ఈ అంశంలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## మౌనంగానే వ్యూహ రచన చేస్తున్న కేసీఆర్

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు దాకా? కాంగ్రెస్‌ను కడిగిపారేసే ప్రయత్నం చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి ఎపిసోడ్‌తో.. వ్యవహారం మరింత పీక్స్‌కు చేరింది. అంశం ఏదైనా రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగుడుగునా ఇరకాటంలో పెట్టేందుకు? ప్రజల ముందు దోషిగా నిలబెట్టేందుకు.. ప్రయత్నం చేస్తున్నారు హరీష్‌రావు, కేటీఆర్. వరుస ఆందోళనలతో కాంగ్రెస్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పెద్దసార్ స్పందించడం లేదేంటన్నదే అందరినీ తొలిచి వేస్తున్న ప్రశ్న. 14ఏళ్లు ఉద్యమాన్ని నడిపిన నాయకుడు.. 10ఏళ్లు రాష్ట్రాన్ని ఏలిన నాయకుడు.. ఇప్పుడిలా మౌనవ్రతంలోకి వెళ్లడం పార్టీవర్గాలనే కాదు, సామాన్య ప్రజలను కూడా ఆశ్చర్యపరుస్తోంది. అంశమేదైనా కేసీఆర్ అంటేనే ఫైర్? అన్నట్టుగా ఉంటుంది ఆయన వ్యవహార శైలి. కానీ, ఇప్పుడిలా కామ్‌గా ఉండిపోవడం ఆయన అభిమానులకు అస్సలు నచ్చట్లేదు. అధికారం ఉంటేనే వస్తారా? లేదంటే జనాలు అక్కర్లేదా? అనే వారూ ఉన్నారు.పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్‌నేతలకు తాను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదనుకుంటున్న కేసీఆర్? ఆ బాధ్యతను కేటీఆర్, హరీష్‌లకు అప్పగించారట. అందుకే, సీఎం రేవంత్ విమర్శలు, ఆరోపణలు చేయడమే గాని, కేసీఆర్ నుంచి ఇప్పటివరకూ ఒక్క కౌంటర్ కూడా రాలేదు. ఇక, పార్టీని గాడిన పెట్టే బాధ్యతను కూడా హరీష్, కేటీఆర్‌లకే వదిలేసిన కేసీఆర్? వారి సత్తాకు పరీక్ష పెడుతున్నారనే చర్చ కూడా జరుగుతోంది. అందుకే, ఎవరికివారు పోటాపోటీగా ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతూ ముందుకెళ్తున్న బావబామ్మర్దులు కేసీఆర్ టాస్క్‌ను పూర్తిచేసే పనిలోనే ఉన్నారట.అసలు, ప్రస్తుతం కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటం కూడా? కేసీఆర్ దిశానిర్దేశంలోనే జరుగుతోందిట. అధినేత ఎలా చెబితే అలా ముందుకెళ్తూ? రాజకీయాల్ని వేడెక్కిస్తున్నారట బీఆర్ఎస్ నేతలు. ఈ లెక్కన లోపల ఉంటూనే ఇంత రచ్చ చేస్తున్న కేసీఆర్.. ఒకవేళ నిజంగానే బయటకు వస్తే.. కాంగ్రెస్ వాళ్లు తట్టుకుంటారా? అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి గులాబీశ్రేణులు. అంతేకాదు, అధినేత మౌనం వెనక పెద్ద వ్యూహం లేకపోలేదని కూడా అంచనా వేసుకుంటున్నాయి. కచ్చితంగా భారీ పొలిటికల్ స్కెచ్‌తోనే.. ఆయన సైలెన్స్ మెయింటెన్ చేస్తున్నారనీ.. దాంతో భారీ విస్ఫోటనం తప్పకపోవచ్చనే ధీమానూ వ్యక్తం చేస్తు?న్నాయి.

## పోచారంలో భారీ చోరీ..

## 2.2 కోట్లు, 28 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు



**హైదరాబాద్:** మేడ్చల్ జిల్లా పోచారం ఐటీకారిడార్ ఠానా పరిధిలో భారీ చోరీ జరిగింది. చౌదరిగూడలోని మక్త గ్రామంలో నాగభూషణం అనే వ్యక్తికి చెందిన ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు బీరువాలో దాచిన రూ.2.2 కోట్లతో పాటు 28 తులాలు బంగారు నగలు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగతనం గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కాగా, శంకర్‌పల్లిలో తన 10 ఎకరాల భూమి అమ్మడానికి నాగభూషణం ఒప్పందం చేసుకున్నాడని, అడ్వాన్స్‌గా ఇచ్చిన నగదును దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో ఇది తెలిసినవారు చేసిన పనేనని పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యం నాగభూషణం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## సంపాదకీయం

# కశ్మీరీల ఓటు ఎవరికి?

ఒక నిరంతర ఆశ్చర్యం-కశ్మీర్! 2024 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలూ అందుకు మినహాయింపు కావు, కాబోవు. పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ నాయకురాలు ఇల్తిజా ముఫ్తీ ప్రచార వైనాలు, ప్రజల ప్రతిస్పందనలను ప్రత్యక్షంగా పరిశీలించి, వార్తా నివేదన చేసే క్రమంలో మేము అనంత్‌నాగ్ జిల్లాలోని బిజ్ బెహరాకు వెడుతున్నాం. ఆ పట్టణాన్ని సమీపిస్తున్న తరుణంలో ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయాం. ఏదో కలకలం బిగ్గరగా విన్పించింది. ప్రజలు గుంపులు గుంపులుగా ఒకే వైపు పరుగెత్తడం కన్పించింది. సహజంగానే మేము కలతచెందాం. ఏమి జరిగింది? ఏదైనా పేలుడు ఘటన సంభవించిందా? లేక భయానక ఉగ్రవాదం విరుచుకుపడిందా? ప్రజల ప్రశాంతతకు అంతరాయం కలిగించిందేమిటి? వ్యాకుల పడ్డాం. మా డ్రైవర్ మందహాసం చేశాడు. 'కలవర పడకండి, బిజ్‌బెహరా ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ చూడడానికి క్రీడాభిమానులు ఉరుకులు పరుగులుగా వెడుతున్నారు. అంతే. ఈ తుది పోటీ బిజ్‌బెహరా టీమ్, శ్రీనగర్ టీమ్ మధ్య జరుగుతోంది' అని చెప్పాడు. ఊపిరి పీల్చుకున్నాం. ఆ మ్యాచ్ జరుగుతున్న క్రీడామైదానం క్రికెట్ పిచ్చివాళ్లతో నిండిపోయింది. బహుశా, అది మా కళ్లెదుట కనిపిస్తున్న ఒక 'నయా' కశ్మీర్ దృశ్యం. అవునా? 'నయా' కశ్మీర్‌కు అంతకంటే అత్యుత్తమమైన దృష్టాంతాలు శ్రీనగర్ నడిబొడ్డున ఉన్న చరిత్రాత్మక లాల్ చౌక్‌లో కన్పించాయి. తమ చౌక్‌లో త్వరలోనే ఒక బర్గర్ కింగ్, డొమినోస్ రాబోతున్నాయని అక్కడి దుకాణదారులు చెప్పారు. కశ్మీర్ రాజధాని నగరంలోని ప్రధాన వాణిజ్య కేంద్రమైన లాల్ చౌక్‌లో నిన్నగాక మొన్నటి దాకా, వేర్పాటువాద హురియత్ కాన్ఫరెన్స్ బంద్‌కు పిలుపునిస్తే చాలు ఆ చౌక్‌లో చీమ చిటుక్కుమనేది కాదు. బంద్ రోజునే కాదు, అంతకు ముందు, ఆ తరువాత రోజుల్లో కూడా దుకాణాలు మూతపడివుండేవి మరి. గత ఐదేళ్లుగా ఆ దుకాణాలు సూర్యాస్తమయం తరువాత రాత్రి పొద్దుపోయే వరకు నిర్భయంగా తెరిచే ఉంటున్నాయి. శ్రీనగర్‌లో మేము బస చేసిన హొటల్ యజమాని సగర్వంగా ఇలా చెప్పాడు: '2023%-%24లో లాగా మాకు మునుపెన్నడూ వ్యాపారం జరగనే లేదు. కోవిడ్ కాలంలో అయితే అసలు నా హొటల్‌ను అమ్మివేసేందుకు కూడా నిర్ణయించుకున్నాను. అయితే ఆ దుస్థితి తొలగిపోయింది. పర్యాటకులు మళ్లీ వెల్లువెత్తుతున్నారు. అన్ని రకాల ప్రయాణ సదుపాయాలు, విద్యుత్ సరఫరా పరిస్థితులు ఇతోధికంగా మెరుగుపడ్డాయి. ఎట్టకేలకు కశ్మీర్ మళ్లీ సరైన, పురోగమన పథంలో సాగుతోంది'. ఆ హొటల్ యజమాని ఆనందమే మా ఆనందమయింది. ఎంతసేపు? శ్రీనగర్ పాతబస్తీలోని జామా మసీద్‌కు వెళ్లాం. ఆ రోజు శుక్రవారం. నమాజ్ అప్పుడే ముగిసింది. గతంలో శుక్రవారం ప్రార్థనల తరువాత అక్కడ రాజ్యవ్యవస్థ ప్రతీకలు, ప్రతినిధులపై రాళ్లు రువ్వడం పదే పదే పునరావృతమయ్యే కార్యక్రమంగా ఉండేది. ఇంకెంత మాత్రం కాదు. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య ప్రజలు మసీదు నుంచి ప్రశాంతంగా తమ దుకాణాలు, కార్యాలయాలు లేదా ఇళ్లకు వెడుతున్నారు. కెమెరా ఫోకస్ చేయమని చెప్పి, గుంపులోని వ్యక్తులతో మాట్లాడడం ప్రారంభించాను. అగ్నిపర్వతం బద్దలయిందా అని అన్పించింది. ప్రశ్నలు వేయడం మొదలుకాగానే నా ఎదుట ఆగ్రహ భార్గవులను కన్నాను, విన్నాను. 'కశ్మీర్‌లో అంతా సవ్యంగా ఉంటే మీర్వాయిజ్ ఫరూఖ్ (హురియత్ నాయకుడు)ను ఎందుకు గృహ నిర్బంధంలో ఉంచారు?' అని ఒక వృద్ధుడు తీక్షణ స్వరంతో ప్రశ్నించాడు. 'మేము మౌనంగా ఉన్నాం. నిజమే. అయితే మా మౌనాన్ని జరుగుతున్న దాన్ని మేము అంగీకరిస్తున్నట్టుగా అర్థం చేసుకోవద్దు. మా రాష్ట్రాన్ని ఒక కేంద్ర పాలిత ప్రాంతంగా కుదించివేసి న్యూఢిల్లీ మమ్ములను శిక్షించింది. నిజం కాదా?' అని మరో ఆగ్రహ గొంతు మమ్ములను నిలదీసింది. 'మేము భయం భయంగా బతుకుతున్నాం. మా అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేస్తే మమ్ములను తప్పక జైలులోకి తోసేస్తారు' అని స్థూలకాయుడు అయిన ఒక వృద్ధుడు సూటిగా చెప్పాడు. పరిస్థితి అదుపు తప్పుతోందని మాకు అర్థమయింది. ఇంతలో జమ్మూ-కశ్మీర్ పోలీసధికారి ఒకరు అక్కడకు వచ్చి మమ్ములను అక్కడి నుంచి సురక్షిత ప్రదేశానికి తీసుకువెళ్లాడు. 'వేర్పాటువాదుల బృందాలను రాజకీయంగా ఎంతగా బలహీనపరచాలో అంతగా బలహీనపరిచారు. అయితే వేర్పాటువాద వైఖరులు, ఆకాంక్షలు ఇంకా ఎంతో బలీయంగా ఉన్నాయి' అని ఆ పోలీసధికారి మాకు స్పష్టంగా చెప్పాడు. జనాల మనోభావాలు ఇలా ఉన్న పరిస్థితులలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో కశ్మీర్ లోయ ప్రజలు పాల్గొనడం ప్రారంభమయింది. ఒక దశాబ్ద కాలంలో మొట్ట మొదటిసారిగా జరుగుతున్న, అందరూ ఎదురుచూసిన శాసనసభ ఎన్నికలు ఇవి. కశ్మీరీలు రికార్డు స్థాయిలో తమ ఓటు హక్కు వినియోగించుకోగలరనే అంచనాలు బాగా ఉన్నాయి. రాళ్లు రువ్విన, బుల్లెట్లను చవిచూసిన ప్రజలు ఎట్టకేలకు కశ్మీర్ వివాదానికి సరైన పరిష్కారం తమ నిరసనను మరింత ప్రభావశీలంగా తెలిపేందుకు ఓటు హక్కును సంపూర్ణంగా ఉయోగించుకోవడమేనన్న దృఢ నిర్ణయానికి వచ్చారు. అధికరణ 370 రద్దు దరిమిలా నెలకొన్న పరిస్థితులలో పట్టువిడుపులు లేకుండా కఠిన వైఖరి అవలంబించేందుకు ఆస్కారం చాలా తక్కువగా ఉందనే వాస్తవాన్ని రాజకీయ పక్షాలు సైతం బాగా గుర్తించాయి. నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనాయకుడు ఒమర్ అబ్దుల్లానే ఇందుకొక నిదర్శనం. ఆయన తొలుత ఈ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నారు. అయితే ఒకటి కాదు, రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు! మరో మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఈ ఎన్నికలలో పోటీ చేయనప్పటికీ తన కుమార్తె ఇల్తిజా ముఫ్తీని ప్రప్రథమంగా ఎన్నికల బరిలోకి దించారు. సరే, కశ్మీర్ లోయలో బీజేపీకి లాంఛనప్రాయమైన ఉనికి మాత్రమే ఉన్నది. రాహుల్‌గాంధీ 'మొహబ్బత్ కి దుకాన్' సందేశం కశ్మీర్ లోయ ప్రజల మనసుల్లో గట్టిగా ప్రతిధ్వనించగలదనే ఆశ కాంగ్రెస్ శ్రేణుల్లో నిండుగా ఉన్నది. కశ్మీర్ లోయలోని ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలు అయిన నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీలలో పాలక వంశాల ప్రాబల్యం తీవ్రంగా ఉంది. అయితే ఈ ఎన్నికల సందర్భంలో అవి పతాక శీర్షికలలో అంతగా ఉండడం లేదు. అలా ఉంటున్నది చిన్న రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులే. కశ్మీర్ రాజకీయ క్రీడా నియమాలను మార్చివేసేందుకు వీరు ప్రయత్నిస్తున్నారు. ఈ ఏడాది మేలో జరిగిన 18వ సార్వత్రక ఎన్నికలలో రీతి రివాజులకు కట్టుబడని స్వతంత్ర అభ్యర్థి షేక్ అబ్దుల్ రషీద్ (ఇంజినీర్ రషీద్‌గా సుప్రసిద్ధుడు) ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా నియోజకవర్గంలో ఒమర్ అబ్దుల్లాను, సజ్జాద్ లోనెను ఓడించి కశ్మీరీలనే కాదు, యావత్ భారతీయులనూ దిగ్భ్రాంతిపరిచారు. ఉగ్రవాదులకు ఆర్థిక సహాయమందించాడనే ఆరోపణపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఊపా) కింద ఖైదీగా రషీద్ 2019 నుంచి తీహార్ జైలులో ఉన్నారు. 'తీహార్ కా బద్‌లా వోట్ సే' అన్న యుద్ధ నినాదంతో ఆయన లోక్‌సభ ఎన్నికలలో అనూహ్య విజయం సాధించారు. తాను అమాయకుడినని ఇప్పటికీ గట్టిగా వాదిస్తున్న రషీద్‌కు ఇప్పుడు మూడు వారాల పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు బెయిల్ మంజూరయింది. బహుముఖ పోటీలు కశ్మీర్‌లో ప్రజాస్వామ్య వాతావరణానికి ఒక నిదర్శనమని కేంద్ర ప్రభుత్వం పదే పదే చెబుతోంది. ఈ అసెంబ్లీ పోరు, 1977 (షేక్ అబ్దుల్లా అనేక ప్రతికూలతలను ఎదుర్కొని మళ్లీ అధికారానికి వచ్చిన సంవత్సరమది) అనంతరం కశ్మీరీలు పూర్తి స్థాయిలో, క్రియాశీలంగా పాల్గొంటున్న ప్రప్రథమ ఎన్నికలు. ఈ శాసనసభ సమరం పట్ల బహిరంగంగా వెల్లువవుతున్న ఆనందోత్సాహాలు కశ్మీరీల మనస్సుల్లోని అంతర్గత అల్లకల్లోలాన్ని దాచిపెడుతున్నాయి. అవును, ఇది నిజం. భారతదేశ ఏకైక ముస్లిం మెజారిటీ రాష్ట్రాన్ని ఒక కేంద్ర పాలిత ప్రాంతంగా కుదించివేయడం, ఒక మునిసిపాలిటీ కంటే తక్కువ అధికారాలు ఉన్న శాసనసభ ఏర్పాటుకు పూనుకోవడం, కశ్మీర్ లోయకంటే జమ్ము ప్రాంతానికి ఎక్కువ ప్రాతినిధ్యం లభించేలా నియోజకవర్గాల పునర్విభజన, పరిపాలనా వ్యవస్థను ప్రజలు ఎన్నుకోని, అందునా కేంద్రానికి ఏజెంట్‌గా వ్యవహరించే లెఫ్టినెంట్ గవర్నర్ నియంత్రణలో ఉంచడం మొదలైనవి కశ్మీరీలకు మాటల్లో చెప్పలేని మనస్తాపం కలిగిస్తున్నాయని మరి చెప్పనవసరం లేదు. కశ్మీర్ ఇంకా ఒక ఘనీభవించిన సంక్షోభంలో చిక్కుకొని ఉంది. ప్రస్తుత పరిస్థితికి భంగం కలిగించి నిక్కమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి వికసించి వర్ధిల్లేలా చేయాలని ఏ ఒక్కరూ నిజంగా కోరుకోవడం లేదు. కట్టడిలో ఉన్న ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛనిస్తే దాన్ని నియంత్రించలేమని వారు భయపడుతున్నారు. భారత జాతీయోద్యమ విలువలను గౌరవించే అటల్ బిహారి వాజపేయి ఉత్తేజకర ఉద్ఘోష 'కశ్మీరియత్, ఇన్సానియత్, జమ్హూరియత్' (సమ్మిళితత్వం, మానవతావాదం, ప్రజాస్వామ్యం) కశ్మీర్ పరిణామాల పరిశీలకులను ఎంతగానో ఉత్సాహపరిచింది.

# రాజీనామా వ్యూహం ఫలించేనా?

ప్రజా న్యాయస్థానంలో తీర్పు కోరుతూ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వ్యూహం ఫలిస్తుందా? అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న అంశం. ఢిల్లీ మద్యం విధానంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థలు పెట్టిన కేసుల కారణంగా రెండు దఫాలుగా జైలులో ఉన్న కేజ్రీవాల్ తాజాగా బెయిలుపై విడుదలైన విషయం విదితమే. జైలు నుంచి బయటికి వచ్చిన వెంటనే తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నానని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగాల్సిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను మహారాష్ట్రతో కలిపి నిర్వహించాలని ప్రకటించి తీవ్ర సంచలనం సృష్టించారు. రానున్న ఎన్నికల్లో ఆప్‌ను మరోసారి గెలిపిస్తేనే తాను తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతానని ఆయన చెప్పడం రాజకీయ సాహసమే గాక, ఢిల్లీ ఓటర్లపై ఆయనకున్న నమ్మకానికి చిహ్నంగా భావించవచ్చు. ఈ లెక్కన పంజాబ్, హరియానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఏ మాత్రం ప్రయోజనకరం కాదనే స్పష్టమైన అవగాహనతోనే హర్యానాలో కాంగ్రెస్ పది సీట్ల వరకు ఇవ్వజూపినా ఆ పార్టీతో పొత్తుకు ఆప్ నిరాకరించింది. కుటుంబ మూలాల రీత్యా సొంత రాష్ట్రమైన హర్యానాలోని మొత్తం 90 సీట్లకు కేజ్రీవాల్ సొంత పార్టీ అభ్యర్థులను నిలబెట్టారు. ఆప్ ప్రభుత్వంలో కీలక శాఖల మంత్రిగా పనిచేసిన ఆతిశీ మార్లెనా సీఎం పదవి చేపట్టాక జరగనున్న ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు ఎక్కువ విజయావకాశాలున్నాయని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. నాలుగు నెలల క్రితం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకున్నది. అయినప్పటికీ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని ఎన్నికల పరిశీలకులు భావిస్తున్నారు. 2011లో కాంగ్రెస్ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి, షీలా దీక్షిత్ నాయకత్వాన నడుస్తున్న ఢిల్లీ కాంగ్రెస్ సర్కారు అవినీతికి వ్యతిరేకంగా ఉవ్వెత్తున లేచిన ప్రజా ఆందోళనల నుంచి అవతరించిన అరవింద్ కేజ్రీవాల్ అనతికాలంలోనే సమర్థ నేతగా ఎదిగారు. 2012లో ఆప్‌ను స్థాపించిన తర్వాత అనతికాలం లోనే ఆయన ఓటర్లను ఆకట్టుకున్నారు. ఏడాది తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 సీట్లలో ఆప్ 28 స్థానాలు గెలిచి, రెండో పెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీని అధికారంలోకి రాకుండా నిరోధించే లక్ష్యంతో 8 మంది కాంగ్రెస్ సభ్యులు ఇచ్చిన మద్దతుతో కేజ్రీవాల్ 2013 డిసెంబర్ 28న తొలిసారి ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అయితే, లోక్‌పాల్ బిల్లుతో పాటు అనేక కీలక అంశాల్లో కాంగ్రెస్ వైఖరికి నిరసనగా 2014 ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. అయితే మొహల్లా క్లినిక్‌లు, విద్యా విధానంలో మార్పులు, విద్యుత్తు చార్జీల తగ్గింపు వంటి జనాకర్షక విధానాలతో ఢిల్లీ ప్రజలకు ఆప్ తక్కువ సమయంలోనే మరింత దగ్గరైంది. అయితే, కొన్ని వారాల తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహించిన కాంగ్రెస్‌ను కొనసాగించడమా, లేక గద్దె దించడమా? అనేదే ప్రధాన ఎజెండాగా ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆప్ ఢిల్లీలోని అన్ని సీట్లలో ఓడిపోయింది. ఆ తర్వాత 2015లో జరిగిన ఎన్నికల్లో కేజ్రీవాల్ పార్టీ ఎవ్వరూ ఊహించినంతటి భారీ మెజారిటీని సాధించింది. మొత్తం 70 స్థానాల్లో ఆప్‌కు 67 సీట్లు రాగా,



బీజేపీ మూడు స్థానాలే దక్కించుకుంది. 1998-2013 మధ్య 15 సంవత్సరాలు ఢిల్లీని నిరాటంకంగా పరిపాలించిన కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. 2013 ఎన్నికల్లో 8 సీట్లు దక్కించుకున్న కాంగ్రెస్ 2015 ఎన్నికల్లో ఖాతా కూడా తెరవలేదు. తన జనాకర్షక, ప్రజాసంక్షేమ విధానాల ద్వారా అరవింద్ కేజ్రీవాల్ ప్రజలను సంతృప్తి పరచడంలో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో అడుగడుగునా ఆప్ సర్కారును కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులు పెట్టినా కేజ్రీవాల్ తలవంచలేదు. కానీ, బీజేపీ రామబాణానికి పోటీగా హనుమాన్ చాలీసా పఠనం వంటి కొత్త ఆయుధాలతో కాషాయపక్షంతో తలపడ్డారు. ముస్లింల మద్దతు పొందుతూనే హిందూత్వ విషయంలో అవసరమైన మేరకు స్వల్ప స్థాయిలో ఆయన రాజీపడ్డారనే పేరు తెచ్చుకున్నారు. మొదటిసారి ఆప్ నాలుగేండ్ల జనరంజక పరిపాలన తర్వాత 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అంతకుముందు పార్లమెంటు ఎన్నికల్లో మాదిరిగానే ఆప్ ఒక్క సీటూ కైవసం చేసుకోలేకపోయింది. అప్పుడు కేంద్రంలో పాలకపక్షమైన బీజేపీకి ఢిల్లీ ఓటర్లు అనుకూలంగా ఉండటం ఆప్ పరాజయానికి దారితీసింది. ఈ ఎన్నికలైన దాదాపు ఏడాది తర్వాత 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అతి స్వల్ప సంఖ్యలో సీట్లు తగ్గినా ఆప్ మరోసారి తిరుగులేని మెజారిటీ సాధించింది. మొత్తం 70 సీట్లలో 62 స్థానాలు దక్కించుకున్నది. బీజేపీ బలం 3 నుంచి 8కి పెరిగింది. కాంగ్రెస్ వరుసగా రెండోసారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఖాతా తెరవకుండా కొత్త రికార్డు నమోదు చేసింది. ఇక్కడ ఆసక్తికరమైన అంశం ఏమంటే.. ఆప్ వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో (2015, 2020) 85 శాతానికి పైగా సీట్లు (67, 62) కైవసం చేసుకోవడంతో పాటు వరుసగా 54.3 శాతం, 53.57 శాతం ఓట్లు సంపాదించడం విశేషం. రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీకి 40 శాతంలోపు, కాంగ్రెస్‌కు 10 శాతం కంటే తక్కువ ఓట్లు రావడం ఏండ్లకేండ్లు ఢిల్లీని పాలించిన ఆ పార్టీలకు జనామోదం లేదని నిరూపించింది. వరుసగా మూడు పార్లమెంటు ఎన్నికల్లో (2014, 2019, 2024) ఆప్‌కు ఢిల్లీలో ఒక్క సీటు కూడా దక్కలేదు. కానీ, రాజధాని ప్రాంతాన్ని పరిమిత అధికారాలతో జనరంజకంగా పరిపాలించిన పార్టీగా ఆప్‌ను జనం గుర్తించారు. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ అరెస్టయి జైలు జీవితం గడిపిన సింపతీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పెట్టుకున్న పొత్తు కూడా ఆప్‌కు ఉపయోగపడలేదు. కొత్త మిత్రపక్షాలైన కాంగ్రెస్, ఆప్ రాజధానిలో ఖాతా తెరవలేకపోయాయి. హర్యానాలో కూడా ఈ పొత్తు ఫలించకపోవడంతో కాంగ్రెస్‌కు అక్కడి మొత్తం పది సీట్లలో ఐదు మాత్రమే దక్కాయి. ఆప్ పోటీచేసిన ఒక్క సీటు కురుక్షేత్రలో ఆ పార్టీకి ఓటమి ఎదురైంది. ఈ లెక్కన పంజాబ్, హర్యానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఏ మాత్రం ప్రయోజనకరం కాదనే స్పష్టమైన అవగాహనతోనే హర్యానాలో కాంగ్రెస్ పది సీట్ల వరకు ఇవ్వజూపినా ఆ పార్టీతో పొత్తుకు ఆప్ నిరాకరించింది. కుటుంబ మూలాల రీత్యా సొంత రాష్ట్రమైన హర్యానాలోని మొత్తం 90 సీట్లకు కేజ్రీవాల్ సొంత పార్టీ అభ్యర్థులను నిలబెట్టారు. అంతేగాక, కాంగ్రెస్‌తో తెగదెంపులు చేసుకున్నాక తన రాజీనామా నిర్ణయం, మహారాష్ట్ర ఎన్నికలతో పాటే ఢిల్లీ ఎన్నికలు జరిపించాలనే డిమాండ్‌తో ముందుకొచ్చిన కేజ్రీవాల్ మాటలు హస్తం పార్టీకి రుచించలేదు. ఆయన నిర్ణయాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఎన్నికల్లో గెలుపుపై హర్యానాలో ఉన్న ధీమా ఢిల్లీలో కాంగ్రెస్‌కు లేదు. ఈ విధంగా ఒకేసారి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను రాజధానిలో మట్టికరిపించడానికి కేజ్రీవాల్ పన్నిన వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందో త్వరలోనే తేలిపోతుంది. ఒకవేళ మహారాష్ట్రతో పాటే కొద్ది వారాల్లో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరిపిస్తే కొత్త సీఎంగా ప్రమాణం చేసే ఆతిశీ మార్లెనా పాలనతో సంబంధం లేకుండా కేజ్రీవాల్ పదేండ్ల పాలనపై ఓటర్లు తీర్పు ఇస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. రాజకీయ కక్షలతో కేంద్ర ప్రభుత్వం తన చెప్పుచేతల్లోని సీబీఐ, ఈడీ వంటి సంస్థలతో పెట్టిన కేసుల ఫలితంగా కొన్ని మాసాల జైలు జీవితం గడిపిన అనేకమంది ప్రాంతీయ పక్షాల నేతలు ప్రజాక్షేత్రంలో విజయం సాధించిన సందర్భాలే ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్‌కు స్ఫూర్తిదాయకం.

# ప్రజలే వారికి బుద్ధి చెప్తరు!

తొలి ఎన్నికల నాటి నుంచి సుమారు 30 ఏండ్ల దాకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి ఎదురే లేదు. పల్లెల్లో రాజరికం నడిపినవాళ్లే కాంగ్రెస్‌లో చేరి తమ పెత్తనాన్ని యథావిధిగా కాపాడుకున్నారు. ఆస్తులకు కొదవ లేని ఆ కుటుంబాలు రాజదండం తమ చేతిలో ఉందని తృప్తిపడ్డాయి. ఇప్పటిలా సాగు నష్టాలు, నిరుద్యోగం, వాటికి విరుగుడుగా సంక్షేమ పథకాలు లేనందువల్ల జనం ప్రభుత్వం వైపు ఆశగా, ఆసక్తిగా చూసేవారు కాదు. దాంతో నాయకులకు పార్టీ మారే అవసరమే పడలేదు. కాంగ్రెస్ ఆధిపత్యం అప్రతిహతంగా కొనసాగుతున్న కాలంలో 1980 దశకం ఆరంభంలో ఓ కుదుపు వచ్చింది. 'రాష్ట్రంలో ఈ రాయలసీమ రెడ్ల పాలన ఎన్నాళ్లు?' అనే ఆలోచన సీమాంధ్ర కమ్మవారికి కలిగింది. దీనికి సూత్రధారి ఈనాడు రామోజీరావు కాగా, పాత్రధారి నటుడు ఎన్టీ రామారావు. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీతో ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రమే మారిపోయింది. ప్రత్యేకిచి నాన్ రెడ్డి వర్గాలను ఎన్టీఆర్ ప్రోత్సహించి చేరదీశారు. దీంతో కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు టీడీపీలోకి జంప్ అయ్యారు. ఈ మార్పుతో క్యాడర్‌ను కోల్పోయిన కాంగ్రెస్ బలహీనపడింది.

కేసీఆర్ రూపంలో తెలుగునేలపై మరో ప్రభంజనం పుట్టింది. 2001లో ఆయన స్థాపించిన టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ఏపీ రాజకీయాలను అతలాకుతలం చేసింది. 45 ఏండ్ల పాటు పెత్తనం చెలాయించిన ఆంధ్రులు కేసీఆర్ డిమాండ్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. బీఆర్ఎస్‌ను పురిటిలోనే చంపేందుకు వైఎస్ఆర్ కుట్రలు చేశారు. క్రమంగా కేసీఆర్‌కు పెరుగుతున్న ప్రజల మద్దతు చూసి ఇతర పార్టీల నుంచి టీఆర్ఎస్‌లోకి వలసలు మొదలయ్యాయి. తెలంగాణ సాధన కోసం లక్షలాది మంది యువకులు కేసీఆర్ వెంట నడిచారు. ఈ రూపంలో తెలంగాణలోని అన్ని వర్గాలు కొత్తగా రాజకీయాలకు చేరువయ్యాయి. వారిలో చాలామంది స్వరాష్ట్రంలో పదవులను చేపట్టారు. ఎన్టీఆర్, కేసీఆర్ పార్టీలను స్థాపించడం, అవి విజయవంతమవడంతో కాంగ్రెస్‌లోని పెద్దపెద్ద నాయకులు, చిన్నాచితక నేతలు ఆ పార్టీల్లో చేరిపోయారు. తెలంగాణలో కేసీఆర్ పాలన మొదలయ్యాక 2014లో మరో భారీ కుదుపు తప్పలేదు. టీడీపీ ఎమ్మెల్యేల పరిస్థితి అగమ్యమైపోయింది. తెలంగాణలో ఆ పార్టీ మళ్లీ బతికి బట్టకట్టదని స్థానికంగా బలమైనవారు బీఆర్ఎస్‌లోకి వెళ్లిపోయారు. అలాగే కేంద్రంలో కాంగ్రెస్ గద్దె దిగడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేల్లోనూ అభద్రతాభావం ఏర్పడింది. వారు కూడా బీఆర్ఎస్‌ను నమ్ముకున్నారు. కొత్త రాష్ట్రంలో జరిగిన ఈ మార్పులను స్వీయపాలనలో అనివార్య రాజకీయ సమీకరణంగానే భావించాలి.



తెలంగాణ అభివృద్ధి కోసం పాటుపడేవారంతా ఒక్కతాటిపైకి రాక తప్పని అవసరమది. ఒకసారి నేతల కోణంలోంచి చూస్తే.. తెలంగాణలో కొత్త రాజకీయ సంస్కృతి వ్యాపించింది. గత 40 ఏండ్లుగా రాజకీయాల్లోకి వచ్చినవారికి పార్టీ సెంటిమెంట్ లేదనే చెప్పాలి. ప్రజాప్రతినిధులుగా గెలిచినప్పటికీ తమ పార్టీ అధికారానికి దూరమైనవాళ్లలో ఐదేండ్ల పాటు ప్రతిపక్షంలో ఉండే ఓపిక కొరవడుతోంది. 'కోట్లు కుమ్మరించి గెలిచిందే అధికారం కోసం కదా!' అనే కాంక్ష వారిని నిద్రపోనీయడం లేదు. తాము గెలిచిన చోట తమపైనే ఓడిపోయిన అధికార పార్టీ అభ్యర్థులు అధికారుల వద్ద గౌరవం పొందడం, ఆఫీసుల్లో పనులు చకచకా చేసుకోవడం జీర్ణించుకోలేని పరిస్థితి. 'గెలిచి ఎదురీదే ఖర్మ నాకెందుకు' అనే చికాకు వారిని నిలవనీయడం లేదు. 'పార్టీ గీర్టీ జాన్ తే నై.. చలో జంప్ జలానీ' అని చాలామంది ఆలోచిస్తున్నారు. ఈ అనిశ్చితిలో 'నేను పార్టీ మార ను' అన్న మర్నాడే కండువా మార్చేస్తున్నారు.

బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు ఈ మధ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారెవరూ తమ పదవులకు రాజీనామా చేయలేదు. వారిలో ఒకరు కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు కూడా.

కూతురి రాజకీయ భవిష్యత్తు కోసం పదవులిచ్చిన పార్టీకి ఒకరు తీరని ద్రోహం చేశారు. రెండోసారి గెలిచిన ఓ యువ ఎమ్మెల్యే గురువుకే పంగనామాలు పెట్టడం దారుణం. వయసు మీద పడిన పెద్దలు పార్టీ మారి వారి చరిత్రకే మచ్చ తెచ్చుకున్నారు. 81 ఏండ్ల పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్‌లో చేరినప్పుడు 'సచ్చే ముందు ఏం రోగమొచ్చిందని పార్టీ మారిండు' అని తిట్టిన రేవంత్ రెడ్డి.. 85 ఏండ్లున్న కె.కేశవరావు, పోచారం శ్రీనివాసరెడ్డిలను కాంగ్రెస్‌లో చేర్చుకొని ప్రభుత్వ పదవులు కట్టబెట్టారు. వారి ఖర్చంతా ఖజానాకు దండగే. ఈ వ్యవహారంలో తప్పు చేర్చుకొనే పార్టీదా.. చేరే ప్రజాప్రతినిధిదా? అనేది పరిస్థితులను బట్టి ఉంటుంది. ఫిరాయింపు వల్ల పరిణామాలు రకరకాలుగా ఉంటాయి. ఇలాంటి ఫిరాయింపులను నిరోధించేందుకు 1985లోనే చట్టం వచ్చింది. పార్టీ నియమాలను, ఆదేశాలను ఉల్లంఘించినట్లు సాక్ష్యాలుంటే స్పీకర్ వారి సభ్యత్వాన్ని రద్దు చేయవచ్చు. పార్టీ మారే ఎమ్మెల్యేల సంఖ్య 2/3 దాటితే ఈ చట్టం వారికి వర్తించదు. 2016లో 15 మంది టీడీపీ ఎమ్మెల్యేల్లో 12 మంది బీఆర్ఎస్‌లో చేరడం ఈ రకంగా చట్టబద్ధమైనదే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు గులాజీ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించకపోవడంతో వారు కోర్టుకు వెళ్లారు. ఆ పిటిషన్‌పై న్యాయస్థానం సానుకూలంగా స్పందించడం ఓ శుభపరిణామం. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని సెప్టెంబర్ 8న స్పీకర్ కార్యాలయాన్ని కోర్టు ఆదేశించింది. లేకపోతే సుమోటోగా ఈ కేసును విచారణ చేస్తామని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఫిరాయింపు చట్టం ప్రకారం వారు ఎమ్మెల్యేలుగా కొనసాగలేరు. న్యాయం నిలబడి ఉప ఎన్నికలు వస్తే మాత్రం ఓటర్లు వారికి తగిన బుద్ధి చెప్తరు.

# ప్రజాసంక్షేమం కోసం కెసిఆర్ నాయకత్వాన్ని బలపరుద్దాం

**బిఆర్ఎస్ పార్టీనీ కాపాడుకుందాం**

**ప్రజాసమస్యలపై పోరాడే నాయకులే ప్రజాదరణ పొందుతారు**

**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉందాం..**

**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**వనపర్తి నియోజకవర్గ బి.ఆర్.ఎస్ నాయకుల,ప్రజాప్రతినిధుల ఆత్మీయసమ్మేళనం ఆదివారం మాజీ మంత్రి అధ్యక్షతన తన స్వగృహంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యనాయకులకు పలు సూచనలు చేస్తూ నాయకులు స్థానికంగా ప్రజలకు అందు బాటు లో ఉండాలని పిలుపునిచ్చారు.కార్యదక్షత,అనుభవం లేని ప్రభుత్వం నేడు పరిపాలనలో ఉందని అన్నారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని 60లక్షల మంది రైతులు రుణాలు తీసుకుంటే 40లక్షల మంది మాత్రమే రైతులు రుణాలు తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించి రైతు రుణమాఫీకి క్యాబినెట్లో 27లక్షల కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి కేవలం 17లక్షల కోట్లు మంజూరు చేసింది అని దుయ్యబట్టారు.రైతు బంధు,కౌలు రైతులకు రైతు బంధు యాసంగి, వానాకాలం పంట కాలం ముగుస్తున్న నేటికీ ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచారు అని అన్నారు.కళ్యాణ లక్ష్మితో పాటు తులమ్ బంగారం,కె.సి.ఆర్ కిట్టు,అమ్మ ఒడి, మహిళలకు 2500,నిరుద్యోగభృతి,వంటి ముఖ్యమైన హామీలకు మంగళం పాడింది అని ఇట్టి విషయాలను ప్రజలోకి తీసుకెళ్ళి కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను వివరించాలని అన్నారు. ఆశ్రిత పక్షపాతం పాటిస్తూ అనుయాయులకు పెద్ద పీట వేస్తున్నారని 9నెలల కాలములో ఒక్క కొత్త జి.ఓ ఇవ్వకుండా ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. ప్రతి పక్ష పాత్ర సమర్థవంతంగా పోషించి మన హయాములో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వ హనీమూన్ పిరియడ్ ముగిసిందని ప్రజల సమస్యలపై ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. నాయకులు వ్యక్తిగత విమర్శలకు తావు ఇవ్వకుండా విధానాలపై మాట్లాడి ప్రజల మన్ననలు పొందాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్,బి. లక్షమయ్య,సర్దార్ ఖాన్,మీడియా కన్వీనర్ నందిమల్ల. అశోక్,పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం.పరంజ్యోతి,మాజీ ఎం.పి.పిలుకృష్ణనాయక్,పృథ్వీరాజ్, సంధ్యతిరుపతయ్య,Z.P.T.C లు రఘుపతి రెడ్డి,పద్మవెంకటేశ్,మాజీమార్కు ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్,సింగిల్ విండో అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, జగన్నాథం నాయుడు, మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ సాయికుమార్, వైస్ చైర్మన్ కర్రే స్వామి,మండల పార్టీ అధ్యక్షులు వనం.రాములు, వెంకటస్వామి,వేణు, రాళ్ళ.కృష్ణయ్య, రఘు రామరావు,బి.బాలరాజు కౌన్సిలర్స్ బండారు కృష్ణ, నాగన్న యాదవ్, కంచె.రవి,ఎల్లా రెడ్డి,మేకల.ఎల్లయ్య,S.T సెల్ నాయకులు జాత్యనాయక్, చంద్రశేఖర్ నాయక్,మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు ఉస్మాన్,మత్స్య సంఘం డైరెక్టర్ పుట్ట.బాలరాజు, నాగేంద్రమ్, నాయకులుఉంగ్లమ్. తిరుమల్,ప్రేమ్ నాథ్ రెడ్డి,స్టార్.రహీమ్,కో ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్,సయ్యద్ జమీల్, నందిమల్ల. రమేష్,ఎం.డి గౌస్, సేనాపతి,మైనారిటీ సెల్ అధ్యక్షులు జోహెబ్ హుస్సేన్, వహీద్,యువత అధ్యక్షులు సూర్యవంశపు.గిరి,మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి,సోషల్ మీడియా కన్వీనర్ సునీల్ వాల్మీకి,పెబ్బేరు మండల మైనారిటీ నాయకులు మాజిద్,మండల యువత అధ్యక్షులు చిట్యాల. రాము, వడ్డేమా న్.రవి,నాగరాజు,కార్తీక్,బలీదుపల్లి అంజి,వజ్రాల.రమేష్, మాజీ సర్పంచులు,మాజీ ఎం.పి.టి.సి లు తదితరులు పాల్గొ న్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న నంచర్ల గురుకుల టీచర్



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ :** ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న నంచర్ల గురుకుల పాఠశాల మ్యూజిక్ టీచర్ శ్యామల ప్రజా కవి కాళోజి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ,తెలంగాణ సాహిత్య దిగ్గజం ఆచార్య పాకాల యశోదరెడ్డి జన్మదినల మాసం పురస్కరించుకొని ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ మహిళా సాహితి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవం 2024 కార్యక్రమంలో మహమ్మదాబాద్ మండల పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ నంచర్ల గురుకుల పాఠశాల సంగీత టీచర్ శ్యామల విద్యార్థులకు అందిస్తున్న సేవలకుఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్యులు కసిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రముఖ రచయిత డాక్టర్ రాయారావు, సూర్య ప్రకాష్ రావు, ప్రముఖ కవయిత్రి వీణారెడ్డి,ఉమ్మడి మహబూబ్ జిల్లా పూర్వ విద్యాశాఖ అధికారి విజయకుమార్, పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ వంగీపూరం శ్రీనాథ్, మహిళ సాహిత్య సాంస్కృతిక సంస్థ సమన్వయకర్త వనజా చేతుల మీదుగా అందుకున్నారు.ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న సంగీత ఉపాధ్యాయురాలు శ్యామలను సాంఘిక సంక్షేమ గురుకుల సోసైటి అధికారులు,నంచర్ల గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందం, అభినందించారు.

# బండి సంజయ్ కి ఘన స్వాగతం



**అగ్నిధారన్యూస్,కమాన్ పూర్ సెప్టెంబర్ 22:**భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ మండల ప్రధాన కార్యదర్శి ఇటీవల మరణించగా కుటుంబాన్ని పారమర్శించుటకు వెళ్తున్న కేంద్ర మంత్రి కి కమాన్ పూర్ ఎక్స్ రోడ్డు వద్ద భాజపా శ్రేణులు ఘన స్వాగతం పలికారు.పెద్దపల్లి జిల్లా బిజెపి అధ్యక్షులు చందుపట్ల సునీల్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు చల్ల నారాయణ రెడ్డి తో పాటు, పార్టీ శ్రేణులు శాలువా పూల మాలలతో ఘనంగా సత్కరించారు. కమాన్ పూర్ బిజెపి మండల అధ్యక్షుడు జంగపల్లి అజయ్,జిల్లా ఉపాధ్యక్షులు మచ్చగిరి రాము,భూంపెల్లి మొండయ్య,బర్ల సది,వడ్లకొండ తిరుపతి,మల్లారపు అరుణ్,చిప్పకుర్తి సతీష్,జంగపల్లి శ్రీనివాస్,జంగపల్లి స్టేబిస్,కొయ్యడ సతీష్,పంథాకాని విశ్వతేజ,సాగర్ల లక్మణస్వామి,మోర ప్రశాంత్,బత్తుల సమ్మయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా మానవ హక్కుల కమిటీ చైర్మన్ నియామకం....

**అగ్ని ధారా న్యూస్ ,మేడిపల్లి మండలం, సెప్టెంబర్ 22:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన తొగరి లక్ష్మీపతి జగిత్యాల జిల్లా మానవ హక్కుల కమిటీ చైర్మన్గా ఎన్నిక కావడం జరిగింది. రాష్ట్ర మానవ హక్కుల కమిటీ చైర్మన్ నియామక పత్రాన్ని లక్ష్మీపతికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా తదిరి లక్ష్మీపతికి గ్రామ ప్రజలు, పలువురు శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

# ప్రైవేట్ఉపాధ్యాయులసేవలుమరువరానివి



## ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**ప్రైవేట్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు మరువరానివని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా జిల్లెల్ల చిన్నారెడ్డి అన్నారు.సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ప్రైవేట్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తూ ఉత్తమ ఫలితాలు సదిస్తున్నారని,తక్కువ వేతనంతో పనిచేస్తున్నామనే భావన ఏమాత్రం లేకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాంటి వారిని ప్రోత్సహిస్తూ సాహితీ కళా వేదిక ద్వారా ఘనంగా సన్మానిస్తున్న శంకర్ గౌడ్ కు అభినందనలు తెలిపారు.పట్టణంలోని రేడియంట్ పాఠశాల డైరెక్టర్ దేశ్ రాములు సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం ప్రశంసనీయమని చిన్నారెడ్డి వివరించారు.మాజీ జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అధునాతన సాంకేతిక విజ్ఞానంపై చిన్నప్పటి నుండే విద్యార్థులలో ఆసక్తిని కలిగించాలని, తద్వారా చక్కటి భవిష్యత్తుకు బాటలు వేసిన వారవుతారని అన్నారు.జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 100మంది ఉపాధ్యాయులను నిర్వాహకులు శాలువా జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.ఈనాటి కార్యక్రమంలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి కృష్ణ, డి సి ఇ బి జిల్లా కార్యదర్శి సూర చంద్ర శేఖర్,గణేష్ కుమార్,శుభ లక్ష్మి బైరోజు చంద్ర శేఖర్,కందూరు నారాయణ రెడ్డి, బండారు శ్రీనివాస్,సత్తార్ డివి వి యస్ నారాయణ,గంధం నాగరాజు, కె.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మరణించిన కుటుంబానికి ఆర్థిక సహాయం




## చారి ట్రాబుల్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :**తలకొండపల్లి మండల కేంద్రంలో మీసాల రాములమ్మ, అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. ఈ విషయం స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న మిషన్ భగీరథ మాజీ వాయిస్ ఛైర్మెన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,తలకొండ పల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 3000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమ%శీ%లో మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, సింగిల్ విండో డైరెక్టర్స్ కటికల శేఖర్ యాదవ్ , యాదయ్య, మాజీ వార్డ్ మెంబర్స్ ఈశ్వర్,దశరథ,వెంకయ్య,యాదయ్య రవి కుమార్ ,రాములు,కృష్ణ,మల్లేష్,శివ, వెంకటేష్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# భారీ ధర పలికిన న్యూస్ స్టార్ గణపతి లడ్డూ



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండల కేంద్రంలోని న్యూ స్టార్ యువజన సంఘం వినాయకుని చేతి లడ్డు వేలంలో 1,00,116రూ,, ఒక లక్ష నూట పదహారు రూపాయలు, గడ్డల నవీన్ స్వామీ వారి దివ్య ప్రసాదం పొందడంతో కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో, ఈసారి నరేష్, శ్రీకాంత్, గడ్డల హరీష్, శేఖర్, కుమార్, నవీన్, కుమార్,శివ, ప్రవీణ్, రాము, మల్లేష్, భరత్,శ్రీహరి,బాలకృష్ణ, బన్నీ, మహేష్, పాల్గొన్నారు.

# ఏచూరి కి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** వనపర్తి జిల్లా కేంద్రం దాచలక్ష్మయ్య ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అంచెలంచెలుగా ఎదిగి, సీపీఎం ప్రధాన కార్యదర్శి అయ్యారనీ 1985లో భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీలో, 1988లో కేంద్ర కార్యవర్గంలో, 1999లో పొలిట్ బ్యూరోలో ఏచూరికి చోటు దక్కడం ఆయన నిబద్ధతకు నిదర్శనం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# "సత్య శోధక్ సమాజ్" కుల నిర్మూలన సదస్సును జయప్రదం చేయండి



## సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇ నరేష్

**అగ్నిధార న్యూస్,(రామగుండం) :** "సత్య శోధక్ సమాజ్" కుల నిర్మూలన సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇ నరేష్ పిలుపునిచ్చారు. ఆదివారం అంతర్గాం మండల్, పెద్దంపేట్ గ్రామంలోని "సి పి ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ" పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ... మహాత్మా "జ్యోతిబాపూలే" స్థాపించిన 152 వ "సత్యశోధక్ సమాజ్" కులనిర్మూలన సదస్సులను సెప్టెంబర్ 24 నుండి 30 వరకు జరపాలని సి పి ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పిలుపునిచ్చిందని ఇందులో భాగంగానే ఈనెల 29 న పెద్దంపేట పార్టీ కార్యాలయంలో జరిగే సదస్సుకు ఉమ్మడి రామగుండం మండలంలోని కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కే రాజన్న, జిల్లా నాయకులు ఐ కృష్ణ, మేరుగు చంద్రయ్య, కొల్లూరి మల్లేష్, డివిజన్, మండల నాయకులు నాయకులు ఆర్మూళ్ళ తిరుపతి, తమ్మెన వేణి కొమురయ్య, సమ్మెట తిరుపతి, బొంతు ఆనంద్, గొట్టే శంకర్, లింగంపల్లి శంకర్, జనగామ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళన



**అగ్నిధారన్యూస్,(రామగుండం) :** 1984 నుండి 1994 మొదటి ఎస్ఎస్సిబ్యాచ్ నుండి పది బ్యాచ్ల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా, అల్మినీ మెగా ప్రోగ్రాం అక్టోబర్ 20వ తేదీ జరిగే ప్రోగ్రామ్ గురువులను ఆహ్వానించాలని చర్చించడం జరిగింది.. హార్సల్ గా.. మినీ గెట్ టుగెదర్ జరిగింది... ఈ కార్యక్రమంలో.... పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ కోఆర్డినేషన్ కమిటీలను ఎన్నుకోవడం జరిగింది..... ప్రోగ్రాం కన్వీనర్ గా దేవి లక్ష్మీనరసయ్య.. కోశాధికారులుగా.. తాటిపాముల రమేష్.. ఏ రాజేశం. ఆర్ శ్రీనివాస్.. కెఎప్టి శంకర్.. ఇన్చార్జిలుగా.. తోడేటి రవికుమార్... ఫసియుద్దీన్ . మల్క ప్రభాకర్. ఎంశంకర్, ఆడెపు నగేష్. కే శ్యాంసుందర్ ఆంజనేయులు.. తాజుద్దీన్.. ఓ లక్ష్మీ నరసయ్య.. మంజులత. శ్రీనివాస్.. ఇంకా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు..

# రాష్ట్రస్థాయి యాదవ ఉపాధ్యాయ పురస్కారాలు




**అగ్నిధారన్యూస్ (గోదావరిఖని) :** ఆదివారం రోజు హైదరాబాద్ ప్రెస్ క్లబ్లో యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన యాదవ రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ పురస్కారంలో శరత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైందవి ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ హాజరైనారు. వారి చేతుల మీదుగా యాదవ జాతి కోసం ఉపాధ్యాయుల సంక్షేమ కోసం కులం జాతి అభివృద్ధి కోసం పాటుపడిన గురువులను సన్మానించడం జరిగింది. దానిలో భాగంగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఆవుల రాజేష్ యాదవ్, కన్నబోయిన యాదవ రాజు, కొమ్మ చందయాదవ్ జిల్లా నుంచి పురస్కారాలు అందుకున్నారు .కార్యక్రమంలో యాదవ సేవా సంఘం సభ్యులు బాబురావు సుమలత, శ్రీకాంత్, సునీత, మేకల లలిత యాదవ్ వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం





### రాధాకృష్ణ ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :**కడ్తాల్ మండలంలోని సాలార్ పూర్ గ్రామానికి చెందిన కుప్పల వెంకటేష్ శనివారం సాయంత్రం అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న రాధాకృష్ణ ట్రస్ట్ చైర్మన్ దశరథ నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆ కుటుంబానికి ట్రస్ట్ ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. అదేవిదంగా మాజీ ఎంపిటిసి ప్రియా రమేష్ 3000 వేల రూపాయలు, మాజీ వార్డ్ సభ్యులు బాబా 2000 ఆర్థిక సాయం అందించారు. అలాగే కడ్తాల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వరికుప్పల మహేష్ ఆదివారం తెల్లవారుజామున జరిగిన యాక్సిడెంట్ లో మరణించడం జరిగింది. వారి కుటుంబానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000 రూపాయల ఆర్థిక సాయం అందించగా, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. అలాగే మాజీ ఎంపీపీ ఆనంద్ 5000 రూపాయలు, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో, పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ మాజీ ఎంపీపీ సువాలి పంతు మాజీ ఎంపీటీసీలు ప్రియా, రమేష్, సాయిలు, నాయకులు అంజాద్, హైదర్, చందు, శంకర్, జగన్, నాగప్ప, గోపాల్, వెంకటేష్, రాజేందర్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తమ్ముని మరణం తట్టుకోలేక అన్న మృతి





**అగ్నిదారన్యూస్ ( ఎండపల్లి ):** ఈ రోజుల్లో బంధాలు, బాంధవ్యాలకు విలువ లేని రోజులు ఇవి ఆస్తి తగాదాల్లో రక్తసంబంధీకులు గొడవలు పెట్టుకోవడం, ఒకరినొకరు హత్యలు చేసుకున్న సంఘటనలు ఎన్నో విన్నాం,ఎన్నో చూస్తున్నాం. కానీ ఇందుకు భిన్నంగా జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం పాతగూడూర్ గ్రామంలో ఓ హృదయ విషాదకర సంఘటన చోటు చేసుకుంది. తమ్ముని మరణాన్ని చూసి తట్టుకోలేక అన్న శ్వాస విడిచిన ఘటన ఊరు ఊరుని విషాదఛాయల్లోకి నెట్టేసింది. వివరాల్లోకి వెళితే పాతగూడూరు గ్రామానికి చెందిన రెడ్డిమల్ల నర్సయ్య (75) గత కొద్ది రోజుల క్రితం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. ఆపరేషన్ అనంతరం అతని ఆరోగ్యం రోజు రోజుకి మరింత క్షీణించి 35 రోజులు పాటు మృత్యువుతో పోరాటం చేసి శుక్రవారం రోజున మరణించడం జరిగింది. ఈ వార్త విన్న తన అన్న రెడ్డిమల్ల వెంకటయ్య (79) నాకన్నా ముందే మమ్మల్ని వదిలి పోయావా తమ్ముడా అంటూ, తమ్ముడు శవం వద్ద రోధించిన వెంకటయ్య ను చూసి పలువురిని కంటతడి పెట్టించింది. తమ్ముడి మరణాన్ని జీర్ణించుకోలేక మనోవేదనకు గురై శుక్రవారం రాత్రి నుండి నా తమ్ముడు నన్ను రమ్మని పిలుస్తున్నాడంటూ కలవరింపులు చేస్తూ కుటుంబ సభ్యులుకు తన వేదనను రోదిస్తూ చెప్పేవాడు.... ఈ తరుణంలో శనివారం రాత్రి తమ్ముడు నర్సయ్యను కలవరిస్తూ వెంకటయ్య శ్వాస ఆడక తుది శ్వాస విడిచాడు. 24 గంటల వ్యవధిలోనే రెడ్డిమల్ల కుటుంబ సభ్యులు ఇద్దరినీ కోల్పోవడం ద్వారా వారి రోదనలు మిన్నంటాయి. ఈ ఘటన వల్ల ఊరు ఊరంతా విషాదఛాయలు కమ్ముకున్నాయి. ఇప్పటికీ రక్తసంబంధానికి విలువలు ఉన్నాయని ఈ అన్నదమ్ముల మరణం మనకు చాటి చెబుతుంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు గ్రామస్తులు కోరుకున్నారు. వీరిద్దరిది పెద్ద కుటుంబం నలుగురు అన్నదమ్ములు పెద్దవాడు రామయ్య, రెండవ అతను రాజయ్య, మూడవ అతను వెంకటయ్య, నాలుగవ వ్యక్తి నర్సయ్య అక్కచెల్లెలు ఇద్దరు పడిదం మల్లవ్వ, చుక్కల లచ్చవ్వలతో కూడినటువంటి పెద్ద కుటుంబం.

## యాదగిరిగుట్టలో మంత్రులు

## తుమ్మల, కోమటిరెడ్డి పూజలు

**యాదాద్రి భువనగిరి :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు మంత్రులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అధికారులు స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర ప్రజలతో పాటు దేశప్రజలపై లక్ష్మీనరసింహస్వామి దీవెనలు ఉండాలని స్వామి వారిని ప్రార్థించినట్లు మంత్రులు ఈ సందర్భంగా తెలిపారు. వారి వెంట ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## సింగరేణి కార్మికులకు భారీ నజరానా

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటాను దసరా బోనస్ గా ప్రకటించారు. సింగరేణి సంస్థ ఉద్యోగులకు బంపర్ బొనాంజా ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం. దసరా సందర్భంగా గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ బోనస్ ప్రకటించింది. 2023-24 ఏడాదిలో సింగరేణికి 4,701 కోట్లు లాభం వచ్చింది. ఇందులో సింగరేణి కార్మికులకు 796 కోట్ల రూపాయలు బోనస్‌గా ప్రకటిస్తున్నట్టు చెప్పారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. సగటున ఒక్కో కార్మికుడికి 1.90లక్షలు బోనస్.. అలాగే కాంట్రాక్ట్ కార్మికులకు 5వేల రూపాయల చొప్పున ఇస్తున్నట్లు చెప్పారు భట్టి. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ ఉద్యోగులకూ బోనస్ ఇస్తున్నామన్నారు.

# ప్రజా అవసరాల కోసం బీఆర్ఎస్ ఆఫీసు

**ప్రజా అవసరాలకు వినియోగించాలని వినతి**




**నల్గోండ :** కోర్ట్ తీర్పును గౌరవిస్తాం. సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తాం. అప్పటి వరకు బీఆర్ఎస్ ఆఫీసు కూల్చొద్దు. నల్గొండ లోని ఏ పార్టీ కార్యాలయానికి అనుమతులు లేవు. ఈ విషయంలో అన్ని పార్టీలు కలిసి రావాలి.. మంత్రి కోమటిరెడ్డి మాటలకు, అధికారులు మోసపోవద్దు. ప్రజా అవసరాల కోసం బీఆర్ఎస్ ఆఫీసు ను ఉపయోగించండి..” అని నల్గొండ బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు .ఎలాంటి అనుమతులు లేకుండా నల్గొండ జిల్లా కేంద్రం లో నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చాలని 15 రోజుల గడువు ఇస్తూ హై కోర్టు బుధవారం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.నిబంధనల మేరకు నాటి మంత్రివర్గ ఆమోదంతో.. ఆగ్రో సంస్థకు చెందిన, ఎకరం భూమిని ప్రభుత్వ నిబంధనల మేరకు డబ్బులు చెల్లించి, తీసుకొని పార్టీ కార్యాలయాన్ని నిర్మించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కార్యాలయంలో గత మూడు సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే జిల్లాకు చెందినమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి..బీఆర్ఎస్ పై కక్షపూని అనేక సమావేశాలలో, పార్టీ కార్యాలయాన్ని కూలగొట్టాలని.. అధికారులను ఆదేశించారన్నదే వీరి అభియోగం. నాటి మున్సిపల్ కమిషనర్ కు నిర్మాణ అనుమతి కోరుతూ దాఖలు చేసినా ఏ పార్టీ కార్యాలయానికి అనుమతులు లేవంటూ తాత్సారం చేశారని గుర్తు చేస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి తమకు నోటీసులు ఇచ్చినప్పుడు.. తాము ఫైన్ తో డబ్బులు చెల్లిస్తామని నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరినా .. మంత్రి ఆదేశంతో తిరస్కరించారన్నారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి వివరించారు.గత్యంతరం లేకనే బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించంగా, . కోర్టు తీర్పు బీఆర్ఎస్ కు ప్రతికూలంగా వచ్చింది. ‘ కోర్టు తీర్పును ఆసరా చేసుకున్న కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు.. జడ్జిమెంట్ కాపీ రాకముందే.. జెసిబి లు బుల్డోజర్లతో.. కార్యాలయాన్ని కులగొట్టాలని చూస్తున్నారు..’ అని జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. జడ్జిమెంట్ కాపీ అందిన వెంటనే కోర్టులో అప్పీల్ చేస్తామని, అప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చవద్దని పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

**ఏ పార్టీ ఆఫీసుకు అనుమతుల్లేవా.?**

జిల్లాలో ఏ పార్టీ కార్యాలయానికి అనుమతులు లేవని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అన్ని పార్టీల కార్యాలయాలకు కూడా ఇలాంటి నిబంధనలు వర్తింప చేస్తారా అన్న ప్రశ్నలు కూడా ఆ వర్గాల నుంచి వస్తున్నాయి. దశాబ్దాల కిందటే జిల్లా కేంద్రం లో సీపీఐ, సీపీఎం, టీడీపీ, బీజేపీ లకు విలువైన ప్రాంతాల్లో ఆఫీసులు ఉన్నాయి. కాంగ్రెస్ కార్యాలయం కూడా నిర్మాణంలో ఉంది. బీఆర్ఎస్ ఆఫీసు వ్యవహారం తో ఇపుడు అన్ని ఆఫీసుల విషయం చర్చకు వస్తోంది.


# 4 నెలల ముందు నుంచే ఎన్నికల కోలాహలం



**కరీంనగర్ :** ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం వచ్చే ఫిబ్రవరిలో ఖాళీ అవుతుంది. సిట్టింగ్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవన్ రెడ్డి ఉన్నారు. బిఆర్ఎస్ హవా కొనసాగిన సమయంలోనే కాంగ్రెస్ కు చెందిన జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందడంతో ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసేందుకు బోలెడు మంది ఆసక్తి చూపుతున్నారు.నాలుగు ఉమ్మడి జిల్లాలతో ముడిపడి ఉన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచే వారి సంఖ్య ఈసారి సెంచరీ దాటనుంది. పోటీకి ఆసక్తి చూపుతున్న వారు ఓటర్ నమోదు ప్రక్రియతో ప్రచారాన్ని చేపట్టారు. ఎలక్షన్ కమిషన్ అక్టోబర్ 1 నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభిస్తుండగా ఆశావాహులు ఇప్పటికే ఎన్రోల్మెంట్ ప్రక్రియను చేపట్టి మద్దతు కూడగట్టుకుంటున్నారు.అధికార కాంగ్రెస్ పార్టీ తోపాటు బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులుగా బరిలోకి దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. పార్టీ తమకు వేదిక అవుతుందని, టికెట్ రాకపోయినా బరిలో ఉండేందుకు సిద్ధమవుతున్నారు. మున్ముందు ఈ పోటీ అన్ని పార్టీల్లో పెరిగి స్వతంత్రుల సంఖ్య పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. కాంగ్రెస్ కష్టకాలంలో జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ప్రస్తుతం ఆయన పోటీకి ఆసక్తి చూపడం లేదు. దీంతో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు ఎక్కువ మంది పోటీ పడుతున్నారు.ప్రస్తుతం కరీంనగర్ కు చెందిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, ఇటీవల ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన వెలిచాల రాజేందర్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. నరేందర్ రెడ్డి ఇప్పటికే ఉమ్మడి నాలుగు జిల్లాల్లో పర్యటిస్తూ విద్యాసంస్థల ఉద్యోగుల తో సమావేశమై ఓటు నమోదు ప్రక్రియ ముమ్మరం చేశారు. టికెట్ రాకపోయినా ఇండిపెండెంట్ గా పోటీ ఉంటానని స్పష్టం చేశారు.ఉత్తర తెలంగాణలో తన విద్యాసంస్థలు, తనకున్న పరిచయాలతో గ్రాడ్యుయేట్ల వివరాలు ఎన్రోల్మెంట్ కోసం సేకరిస్తున్నారు. వెలిచాల రాజేందర్ రావు ఎంపీ ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తు సిరిసిల్ల చేనేతకు ప్రభుత్వ బ్రాండింగ్, ట్రేడింగ్లో శిక్షణ, గ్రాడ్యేయేట్లకు మేనిఫెస్టోలతో ముందుకెళ్తున్నారు. ఎమ్మెల్సీగా పార్టీ అవకాశమిస్తే పోటీ చేస్తానని తెలిపారు. పార్టీ నిర్ణయమే తనకు శిరోధార్యమని, ఎవరికి టికెట్ ఇచ్చినా బలపరుస్తానని స్పష్టం చేస్తున్నారు.రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ నుంచి మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, డాక్టర్ బీఎన్ రావు, ట్రస్మా ప్రతినిధి యాదగిరి శేఖర్ రావు పేర్లు ప్రము ఖంగా వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ సైతం టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల కేసిఆర్ ను రవీందర్ సింగ్ కలిసి అభయం కూడా తీసుకు న్నారు. అయితే ఎవరికి వారే గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నారు. గత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేసిన రవీందర్ సింగ్ మేయర్ గా సివిల్ సప్లై కార్పోరేషన్ చైర్మన్ గా అందించిన సేవలు, ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లకు చేసిన సేవల ఆధారంగా మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి పోటీకి ఆసక్తి చూపే వారి సంఖ్య కూడా బాగానే ఉంది. కరీంనగర్, ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ ఎంపీలుగా బిజేపికి చెందిన వారే ఉండడంతో ఎమ్మెల్సీ గా గెలుస్తామనే ధీమాతో ఆ పార్టీ నుంచి టికెట్ రేస్ లో ప్రముఖుల పేర్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బిజెపి అధికార ప్రతినిధి రాణిరుద్రమ, బిజేపి కిసాన్ సెల్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుగుణాకర్ రావు, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ బోగ శ్రావణ తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. పార్టీలో సీనియర్ నేత అయిన తనకు ఇటీవల అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో అవకాశం దక్కలేదని ఈసారి ఎలాగైనా తనకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాల్సిందేనని సుగుణాకర్ రావు పట్టుబడుతున్నారు. రాణీ రుద్రమసిరిసిల్ల నుంచి అవకాశం కల్పించిన నేపథ్యంలో ఈసారి తమకు ఇవ్వాల్సిందేనని సుగుణాకర్రావు వర్గం వాదిస్తోంది. మరోవైపు రాణీరుద్రమ మాత్రం కేంద్రమంత్రి బండి సంజయ్ ని నమ్ముకుని టికెట్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో ఎంపీ తరపున ఒకరు టికెట్ కోసం గట్టి ప్రయత్నాలే చేస్తుండడంతో అభ్యర్థి ఎంపిక ఆ పార్టీకి తలనొప్పిగానే మారనుంది.మూడు ప్రధాన పార్టీల నుంచే కాకుండా పార్టీ టికెట్ దక్కకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. అయితే ఎమ్మెల్సీ అభ్యర్థిని ఎవరిని ఎంపిక చేయాలి... అధిష్టానం ఎలాంటి వ్యూహాలతో ముందుకు సాగుతుందో ఎవరి అంతుచిక్కడం లేదు. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులంతా ఎవరి ధీమాలో వారు ఉన్నారుఎన్నికల్లో మరో నాలుగు నెలల తరువాత జరగనున్న నేపథ్యంలో ఇప్పుడే నిర్ణయం తీసుకోవడం అవసరమా? అన్న భావనతో పార్టీ ముఖ్యనేతలు ఉన్నట్టుగా తెలుస్తోంది. షెడ్యూల్ వెలువడిన తరువాత అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై దృష్టి సారించే యోచనలో ప్రధాన పార్టీలు ఉన్నట్లు సమాచారం.

# గులాబీ భవనాల వైపు బుల్డోజర్లు

**నల్గోండ :** నల్లగొండలో అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చివేయాలనే హైకోర్టు ఆదేశాలతో గులాబీ పార్టీలో అలజడి మొదలైంది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా, హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన 33 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మించాలని భావించింది. ఇప్పటికే చాలా జిల్లాల్లో పార్టీ ఆఫీసులు నిర్మించగా, కొన్ని చోట్ల ఎలాంటి అనుమతులు తీసుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో అధికార కాంగ్రెస్ ఆయా భవనాలపై ఫోకస్ చేసింది.ముందుగా నల్గొండలో బీఆర్ఎస్ భవన్‌కు అనుమతులు లేవని? ఆ భవనాలను కూల్చేయాలని రెండు నెలల క్రితం రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హుకుం జారీ చేయడంతో తేనె తుట్టె కదిలింది. మంత్రి కోమటిరెడ్డి హెచ్చరికలతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఎదురుదెబ్బ తగిలింది. దీంతో నల్గొండతో సహా మిగిలిన చోట నిర్మించిన బీఆర్ఎస్ భవనాలపైనా బుల్డోజర్ యాక్షన్ ఉంటుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఏపీలో వైసీపీ ప్రధాన కార్యాలయానికి అనుమతులు లేవన్న కారణంతో రెండు నెలల క్రితం ఆ భవనాన్ని నేలమట్టం చేసింది ఏపీ ప్రభుత్వం. ఆ క్రమంలోనే ఇక్కడా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై కాంగ్రెస్ పార్టీ ఫోకస్ చేయగా, నల్గొండతోపాటు సూర్యాపేట, భువనగిరి, పెద్దపల్లి, మహబూబాబాద్, భూపాలపల్లి, హన్మకొండ, జనగామల్లో భవనాలకు అనుమతిలేదని అధికారులు గుర్తించారు. దీంతో ఆయా కార్యాలయాలకు అప్పట్లోనే నోటీసులు జారీ చేశారు. ఐతే నల్గొండ భవనం విషయమై బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించడంతో మిగిలిన భవనాలపైనా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు హైకోర్టు లైన్ క్లియర్ చేయడంతో నల్గొండ బీఆర్ఎస్ కార్యాలయం కూల్చి వేతకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని చెబుతున్నారు. ఇదే సమయంలో మిగిలిన కార్యాలయాల వైపూ బుల్డోజర్లు వెళ్లను న్నాయా అన్న చర్చ జోరుగా సాగు తోంది. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాల యాలను నిర్మించాలని భావించిన ఆ పార్టీ హైకమాండ్? 2018లో రెండోసారి అధికారంలోకి వచ్చాక కొత్త జిల్లాల్లో పార్టీ కార్యాలయాలకు స్థలాలను కేటాయించింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు స్థలాలను కొనుగోలు చేసి ఆఫీసులు నిర్మించింది. ఇప్పటికే చాలా చోట్ల పనులు పూర్తయి కార్యాలయాలు ప్రారంభమ య్యాయి. ఎక్కడో ఒకటో రెండో మాత్రమే నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పుడు అనుమతులు లేవన్న కారణంతో ఆయా కార్యాలయాలను కూల్చివేస్తే బీఆర్ ఎస్‌కు రాజకీయంగా దెబ్బేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో బీఆర్ఎస్ కార్యాలయాలను కూల్చివేస్తే ప్రతీకార రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వంపై ఆ పార్టీ విమర్శలు గుప్పించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. దీంతో ప్రభుత్వం భవనాల కూల్చివేతకే మొగ్గు చూపుతుందా? లేక రాజకీయ విమర్శలకు తావు లేకుండా ఇంకేమైనా చర్యలు తీసుకుంటుందా? అన్న సందేహాలు వ్యక్తవుతున్నాయి.ఇప్పటికే ఒకవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆకర్ష్ వల వేసిన కాంగ్రెస్?. 10 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంది. ఇప్పుడు ఏకంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కూల్చివేత వైపు ఫోకస్ చేస్తుండటంతో రాష్ట్రంలో రాజకీయం వేడెక్కే పరిస్థితి కనిపిస్తోంది. అక్రమ నిర్మాణాలైనా ప్రభుత్వం తలుచుకుంటే క్రమబద్ధీకరించే అవ కాశం ఉంటుంది. కానీ, బీఆర్ఎస్ అధిష్టానంపై మానసికంగా పైచేయి సాధించాలనే ఆలోచనతో కార్యాలయాలను కూల్చి వేస్తే అది ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశాన్ని పరిశీలిస్తున్నారు.మొత్తానికి కాంగ్రెస్ బుల్డోజర్ ముందుకు కదిలే అంశంలో ఎప్పుడేం జరుగుతుందో అన్న ఉత్కంఠ మాత్రం జోరుగా సాగుతోంది. అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత మొదలు పెడితే.. అది బిఆర్ ఎస్ కార్యాలయాలకే పరిమితం చేయడం సాధ్యం కాదు.. అలా ముందుకు వెళ్తే అనేక చోట్లు సామాన్యులు నిర్మించుకున్న భవనాలను కూల్చాల్సిన పరిస్థితి రావచ్చు.. దీంతో ప్రభుత్వం ఇప్పుడేం చేయబోతుందన్నది ఆసక్తిరేపుతోంది.



## బిజినెస్

### పండుగల సీజన్‌లో ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారా..
### ఈ జాగ్రత్తలు తప్పనిసరి




పండుగల సీజన్ వచ్చేస్తుంది. ఈ నేపథ్యంలో దసరా, దీపావళికి కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉంది. దీంతో అనేక మంది ప్రజలు ఇప్పటి నుంచే ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు. దీనికి తోడు ఇ కామర్స్ సంస్థలు కూడా ఇప్పటికే ఆఫర్ల పేరుతో కస్టమర్లను ఆకర్షిస్తున్నాయి. కిరాణా సామాగ్రి నుంచి మొదలుకుని బట్టలు, ఎలక్ట్రానిక్స్ వరకు ప్రజలు ఎక్కువగా ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ ఆన్‌లైన్ షాపింగ్ సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ, దీని ద్వారా మోసపోయే ప్రమాదం కూడా ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ షాపింగ్ చేసే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం. మీరు షాపింగ్ చేసే విషయంలో ముందుగా మీరు కొనుగోళ్లు చేసేందుకు ప్రముఖ అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే వినియోగించాలి. తక్కువ రేటు ఉందని ఇతర సైట్లు ఇచ్చిన ఆఫర్లతో మోసపోవద్దు. ఎందుకంటే ఆయా సైట్లలో కొనుగోలు చేసిన తర్వాత మీకు సంబంధించిన ప్రొడక్ట్ రాకపోతే ఏం చేయాలో కూడా తెలియదు. కాబట్టి కస్టమర్ కేర్ సపోర్ట్, ప్రొడక్ట్ రిటర్న్ వంటివి ఇస్తున్నారా లేదా అనేది చెక్ చేసుకుని కొనుగోలు చేయాలి.

**ఇమెయిల్ అలర్ట్**

ఈ పండుగల సీజన్లలో సైబర్ నేరగాళ్లు మీ ఇన్‌బాక్స్‌కి ప్రత్యేక డీల్‌లను పంపించే అవకాశం ఉంటుంది. ఆ క్రమంలో ఆఫర్ లేదా డీల్స్ బాగున్నాయని మీరు దానిపై క్లిక్ చేసి మీ బ్యాంకు లేదా డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు అందిస్తే చిక్కుల్లో పడే అవకాశం ఉంటుంది. వీటి విషయంలో జాగ్రత్త వహించాలి.

**పిన్ నంబర్‌ల వాడకం**

అన్నింటి కంటే మొదటిది మీరు అన్ని పోర్టల్‌లలో ఒకే పాస్‌వర్డ్‌ను ఉపయోగించకూడదు. మీ పాస్‌వర్డ్ ఎప్పటికప్పుడు మార్చుతూ ఉంచండి. దీంతోపాటు మీ వ్యక్తిగత వివరాలను ఎవరితో షేర్ చేసుకోకూడదు. మీరు ఆన్‌లైన్ షాపింగ్ కోసం డెబిట్ లేదా క్రెడిట్ కార్డ్‌ని ఉపయోగిస్తుంటే, ప్రతి మూడు నెలలకోసారి మీ పిన్ నంబర్‌ను మార్చుకోవాలి.

**యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్**

ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్‌తో పాటు మీ స్మార్ట్‌ఫోన్‌కు కూడా యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్ అవసరం. స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా కొనుగోళ్లు పెరగడంతో మోసాలకు కూడా అవకాశం పెరిగింది. దీంతో నేరస్థులు మీ సిమ్, క్రెడిట్ లేదా డెబిట్ కార్డ్ వంటి వివరాలను హ్యాక్ చేసి దోచుకునే ఛాన్స్ ఉంది.

**డౌన్‌లోడ్ చేసే క్రమంలో**

యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు అవి నుంచి ఉన్నాయే లేదో నిర్ధారించుకోండి. ఇటీవల కాలంలో అనేక ఫేక్ యాపులను ప్లే స్టోర్ నుంచి తొలగించారు. దీంతో దుండగులు వాటికి సంబంధించిన లింకులను అనేక మంది ఫోన్లకు పంపించి డౌన్‌లౌడ్ చేసుకునే విధంగా చేస్తున్నారు. వాటిని నమ్మి డౌన్ లోడ్ చేసుకుంటే ఇబ్బందులు తప్పవు.

# తగ్గిన పెట్టుబడుల వ్యయం

రాష్ట్రాల ఆర్థిక వృద్ధికి ప్రాణం పోసే మూలధన వ్యయంపై పార్లమెంట్ ఎన్నికలు తీవ్ర ప్రభావం చూపించాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు మూలధన వ్యయాన్ని గణనీయంగా తగ్గించాయి. గత తొలి త్రైమాసికంతో పోలిస్తే ఏపీ 88.7 శాతం, తెలంగాణ 40.4 శాతం పెట్టుబడి వ్యయాన్ని కుదించాయి. పెద్దమొత్తంలో రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) కలిగిన 15 రాష్ట్రాలకుగాను 10 రాష్ట్రాలు తొలి త్రైమాసికంలో పెట్టుబడుల ఖర్చులకు పెద్దమొత్తంలో కోతలు పెట్టాయి. పార్లమెంట్ ఎన్నికల కారణంగా పెట్టుబడుల వ్యయాన్ని ఆయా రాష్ట్రాలు భారీగా తగ్గించినట్టు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన డాటా విశ్లేషణలో వెల్లడైంది.

**తెలుగు రాష్ట్రాల్లో తగ్గిన పెట్టుబడి వ్యయం**

ఆంధ్రప్రదేశ్‌లో 2023 జూన్ నాటికి పెట్టుబడుల ఖర్చు రూ.12,495 కోట్ల నుంచి 2024 జూన్ నాటికి రూ.1,417 కోట్లకు.. అంటే 88 శాతం తగ్గింది. తెలంగాణలో 2023 జూన్ నాటికి రూ.9,817 కోట్ల నుంచి 2024 జూన్ నాటికి రూ. 5,854 కోట్లకు.. అంటే 40 శాతం తగ్గుదల నమోదైంది. గుజరాత్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో కూడా పెట్టుబడుల ఖర్చులో గణనీయమైన తగ్గుదల కనిపించింది. 2024 మొదటి త్రైమాసికం నాటికి రాష్ట్రాల పెట్టుబడుల ఖర్చు బడ్జెట్ నిష్పత్తి.. 5 శాతం నుంచి 20 శాతం మధ్యనే



ఉన్నది.


ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు బడ్జెట్‌లో కేటాయించిన నిష్పత్తుల కంటే పెట్టుబడుల ఖర్చులో తకువ శాతం నమోదు చేశాయి. మొదటి త్రైమాసికంలో 27 రాష్ట్రాల మొత్తం మూలధన వ్యయం గత సంవత్సరం కంటే గణనీయంగా తగ్గింది. జూలై నెలలో మాత్రం 6.8 శాతం పెరుగుదల నమోదైంది. 2019 ఎన్నికల సమయంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో రాష్ట్రాల మూలధన వ్యయం 6.5 శాతం తగ్గింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో తన మూలధన వ్యయంలో 35 శాతం కోత విధించింది.

**ఇది రాష్ట్రాల అభివృద్ధికి ఆటంకమే**

రాష్ట్రాల్లో పెట్టుబడుల వ్యయం తగ్గుదలకు ప్రధాన కారణం సార్వత్రిక ఎన్నికలు అని ఆర్థిక నిపుణుడు సుజన్ హజ్రా అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితి రాష్ట్రాల అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల సమయంలో కూడా ఇలాంటి ధోరణి కనిపించిందని తెలిపారు. రాష్ట్రాల మూలధన వ్యయంలో తగ్గుదల రాష్ట్రాల అభివృద్ధిని పెద్ద ఎత్తున దెబ్బతీస్తుందని, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు సృష్టి, ఆర్థిక వృద్ధి వంటి అంశాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

# పసిడి ప్రియులకు బ్యాడ్‌న్యూస్..
# మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు

బంగారం వెండి ప్రియులకు బ్యాడ్ న్యూస్. ఎందుకంటే రెండో రోజు కూడా వీటి ధరలు భారీగా పెరిగాయి. ఈ క్రమంలో 10 గ్రాముల బంగారం ధర రూ. 810 పెరుగగా, కిలో వెండి ధర రూ. 400 పెరిగింది. ఈ నేపథ్యంలో ఉదయం 6.30 గంటల నాటికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 75,930కి చేరుకోగా, 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ. 69,600కి చేరింది. మరోవైపు ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 76,080కి చేరగా, 22 క్యారెట్ల పుత్తడి ధర 10 గ్రాములకు రూ. 69,750కి చేరుకుంది. దీంతో దేశంలోని ప్రధాన ప్రాంతాల్లో ఉన్న బంగారం, వెండి ధరలను ఇక్కడ చుద్దాం.



ప్రధాన ప్రాంతాల్లో గోల్డ్ రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్) (22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 75,930, రూ. 69,600
ముంబైలో రూ. 75,930, రూ. 69,600
ఢిల్లీలో రూ. 76,080, రూ. 69,750
విజయవాడలో రూ. 75,930, రూ. 69,600
వడోదరలో రూ. 75,980, రూ. 69,650
చెన్నైలో రూ. 75,930, రూ. 69,600
బెంగళూరులో రూ. 75,930, రూ. 69,600
కోల్‌కతాలో రూ. 75,930, రూ. 69,600

దేశంలోని ఇతర నగరాల్లో సిల్వర్ రేట్లు (కిలోకు)

చెన్నైలో రూ. 98000
ఢిల్లీలో రూ. 93000
ముంబైలో రూ. 93000
విజయవాడలో రూ. 98000
హైదరాబాద్‌లో రూ. 98000
బెంగళూరులో రూ. 85000
కేరళలో రూ. 98000
కోల్‌కతాలో రూ. 93000
అహ్మదాబాద్‌లో రూ. 93000
నోయిడాలో రూ. 93000
ఇండోర్‌లో రూ రూ. 93000
వడోదరలో రూ. 93000
జైపూర్‌లో రూ. 93000

గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడూ మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

# చెపాక్‌లో అద్భుత విజయం






బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ బోణీ కొట్టింది. చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్‌పై 280 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి భారత్ దూసుకెళ్లింది. 515 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లా 234 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్ 280 పరుగుల తేడాతో గెలిచింది.

చెపాక్ టెస్టులో తొలి రోజు నుంచే పట్టుబిగించిన టీమిండియా నాలుగో రోజే మ్యాచ్ ముగించింది. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తద్వారా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పట్టికలో భారత జట్టు అగ్రస్థానాన్ని కాపాడుకుంది. అదే ఊపులో సెప్టెంబర్ 27న జరుగబోయే రెండో టెస్టులో కూడా విజయంపై రోహిత్ సేన కన్నేసింది. అయితే.. కాన్పూర్ వేదికకానున్న ఈ టెస్టులో టీమిండియా ఏ మార్పులు చేయడం లేదు. తొలి టెస్టుకు ఎంపిక చేసిన బృందాన్ని కొనసాగించాలని సెలెక్టర్లు భావించారు. దాంతో, దులీప్ ట్రోఫీలో ఆడుతున్న శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లకు నిరీక్షణ తప్పలేదు.

టీమిండియా స్క్వాడ్ : రోహిత్ శర్మ(కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, సిరాజ్, అకాశ్ దీప్, జస్ప్రీత్ బుమ్రా, యశ్ దయాల్.

**స్పిన్ ద్వయం జోరు**




సుదీర్ఘ విరామం తర్వాత.. అది కూడా స్వదేశంలో టెస్టు సిరీస్ ఆడిన భారత జట్టు అద్భుత విజయం సాధించింది. చెపాక్ స్టేడియంలో రవిచంద్రన్ అశ్విన్(113, 6/88), రవీంద్ర జడేజా(86, 3/58)ల ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టగా.. యువకెరటాలు శుభ్‌మన్ గిల్(119 నాటౌట్), రిషభ్ పంత్(109)లు శతకాలతో విజృంభించారు. 515 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్ రెండు సెషన్లలోనే కుప్పకూలింది. శతక వీరుడు అశ్విన్ ధాటికి నిలువలేక పర్యాటక బ్యాటర్లు చేతులెత్తేశారు. జడేజా కూడా ఓ చేయి వేయడంతో బంగ్లాదేశ్ 234 పరుగులకే ఆలౌటయ్యింది. ఆ జట్టు కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో(82) ఒక్కడే అర్ధ శతకంతో రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో చిరస్మరణీయ సెంచరీతో పాటు రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లతో చెలరేగిన అశ్విన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

**అశ్విన్ స్పిన్ మాయ..**

బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హెూస్సేన్ శాంటో(82) హాఫ్ సెంచరీ చేయగా.. మిగతా బ్యాటర్లందరూ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోయారు. ఇక భారత బౌలర్లలో సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆరు వికెట్లు పడగొట్టగా.. రవీంద్ర జడేజా మూడు వికెట్లు, బుమ్రా ఒక వికెట్ తీశారు. ఇక రెండో టెస్టు సెప్టెంబర్ 27 నుంచి కాన్పూర్ వేదికగా ప్రారంభం కానుంది.

## స్పోర్ట్స్

### పుకార్లకు చెక్..
### కాన్పూర్ టెస్ట్ తుది జట్టును ప్రకటించిన బీసీసీఐ




తొలి రోజు కాస్తంత కంగారు పెట్టిన బంగ్లాదేశ్‌పై టీమిండియా ఘన విజయం సాధించింది. చెన్నైలో జరిగిన తొలి టెస్ట్‌లో ఏకంగా 280 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్ట్ మ్యాచ్‌లో సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సంపాదించింది. రెండో టెస్ట్ మ్యాచ్ కాన్పూర్ వేదికగా సెప్టెంబర్ 27వ తేదీ నుంచి ప్రారంభం కాబోతోంది ఈ టెస్ట్ మ్యాచ్‌లో సీనియర్లకు విశ్రాంతిని ఇస్తారని జోరుగా వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఆ వార్తలకు తాజాగా బీసీసీఐ చెక్ పెట్టింది. తొలి టెస్ట్ పూర్తయిన వెంటనే కాన్పూర్‌లో జరిగే రెండో టెస్ట్ గురించి ట్విటర్ ద్వారా కీలక ప్రకటన చేసింది. రెండో టెస్ట్ మ్యాచ్‌లోనూ ఎలాంటి మార్పులు లేకుండా టీమిండియా బరిలోకి దిగుతుందని పేర్కొంది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు రెండో టెస్ట్ నుంచి విశ్రాంతి కల్పిస్తారని వార్తలు బయటకు వచ్చాయి. అయితే అవన్నీ అబద్ధాలని బీసీసీఐ తాజాగా క్లారిటీ ఇచ్చింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టెస్ట్ మ్యాచ్ విజయాల ఆధారంగానే ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించే వీలుంటుందనే సంగతి తెలిసిందే. ప్రస్తుతం టీమిండియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. త్వరలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో టీమిండియా టెస్ట్ సిరీస్‌లు ఆడబోతోంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరాలంటే పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో ఉండాలి. ఈ నేపథ్యంలో ఏ మ్యాచ్‌నూ తేలిగ్గా తీసుకోకూడదని బీసీసీఐ భావిస్తోంది. కీలక టెస్ట్ సిరీస్‌లకు బంగ్లా సిరీస్‌ను సన్నద్ధంగా వాడుకోవాలని బీసీసీఐ అనుకుంటోంది.

# టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న డేవిడ్ వార్నర్





ఆస్ట్రేలియా బ్యాటర్ డేవిడ్ వార్నర్ గురించి తెలుగు వారికి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును 2016లో విజేతగా నిలపడమే కాకుండా తెలుగువారి హృదయాల్లో చోటు సంపాదించుకున్నాడు. ఇక కరోనా లాక్‌డౌన్ టైంలో టాలీవుడ్ మూవీస్ నుంచి డేవిడ్ భాయ్ చేసిన రీల్స్, టిక్ టాక్ వీడియోలు ఫుల్ వైరల్‌గా మారాయి. దీంతో అప్పట్లో డేవిడ్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వమని ఫ్యాన్స్ కూడా కోరుకున్నారు. ఇక రీసెంట్‌గా దర్శక దిగ్గజం రాజమౌళితో క్రెడ్ యాడ్ చేసి నవ్వులు పూయించాడు. ఇదిలావుంటే తాజాగా డేవిడ్ వార్నర్ ఒక టాలీవుడ్ సినిమా చేస్తున్నట్లు సమాచారం అందింది. రీసెంట్‌గా ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. పుష్పలో నేను నటించట్లేదు కానీ ఒక తెలుగు సినిమా అయితే నేను చేస్తున్నా అంటూ చెప్పుకోచ్చాడు. అయితే డేవిడ్ వార్నర్ చేసే తెలుగు సినిమా ఏంటా అని అభిమానులు తెగ సెర్చ్ చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే డేవిడ్ వార్నర్ నటిస్తున్న సినిమాకు సంబంధించి ఒక వార్త వైరల్ అవుతుంది. టాలీవుడ్ నటుడు నితిన్ నటిస్తున్న తాజా చిత్రం రాబిన్ హుడ్ భీష్మ సినిమా తర్వాత నితిన్ వెంకీ కుడుముల కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను వరల్డ్ వైడ్‌గా 2024 డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించారు. అయితే ఈ సినిమాలోనే డేవిడ్ వార్నర్ నటిస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో ఒక డాన్ క్యారెక్టర్‌లో డేవిడ్ వార్నర్ కనిపించబోతున్నట్లు తెలుస్తుంది.



## కథ విన్న తర్వాత నిద్రపోలేకపోయా..

### అమరన్‌పై శివకార్తికేయన్

కోలీవుడ్ స్టార్ యాక్టర్ శివకార్తికేయన్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ %ూఖ%21. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో వస్తోన్న ఈ చిత్రం అమరన్ టైటిల్‌తో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. విశ్వరూపం ఫేం రాహుల్ బోస్ విలన్‌గా నటిస్తున్నాడు. అమరన్ అక్టోబర్ 31న దీపావళి కానుకగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా జరిగిన ఓ ఈవెంట్‌లో శివకార్తికేయన్ మాట్లాడుతూ.. తాను అమరన్ కథ విన్న తర్వాత నిద్రపోలేకపోయానని.. అప్పుడే భారతీయ ఆర్మీ మేజర్ ముకుంద్ వరదరాజన్ కథను అందరికీ చెప్పాలని నిర్ణయించుకున్నానని చెప్పాడు. మిలటరీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రంలో శివకార్తికేయన్ మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో నటిస్తున్నాడు. సరిహద్దులో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయి అశోక చక్ర అవార్డు పొందారు మేజర్ ముకుంద్ వరదరాజన్. ఈ చిత్రాన్ని రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, సోనీ పిక్చర్స్ ఫిలిమ్స్ ఇండియా సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ప్రమోషన్స్‌లో సాయిపల్లవి సంప్రదాయ చీరకట్టులో మెరిసింది. నిర్మాత కమల్ హాసన్ కూడా మూవీ లవర్స్‌తో చిట్ చాట్ చేశాడు. ఇప్పటికే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమర జవాన్ల సేవలను స్మరించుకుంటూ అమరన్ మేకింగ్ వీడియోను షేర్ చేశారు మేకర్స్.



## ఆర్‌టీ 75 క్రేజీ న్యూస్

ధమాకా సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది టాలీవుడ్ క్రేజీ కాంబో రవితేజ శ్రీలీల ఈ ఇద్దరి కలయికలో రవితేజ బెంచ్ మార్క్ ప్రాజెక్ట్ రవితేజ 75 వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా షురూ అయింది. కాగా చాలా రోజుల తర్వాత ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తిక విషయాలు నెట్టింట రౌండప్ చేస్తున్నాయి. తాజా టాక్ ప్రకారం ఆర్‌టీ 75 టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ దసరా సందర్భంగా ఉండబోతుందట. అంతేకాదు ఇందులో రవితేజ మరోసారి పోలీసాఫీసర్‌గా కనిపించబోతున్నట్టు ఇన్‌సైడ్ టాక్. లేటెస్ట్ వార్తల ప్రకారం ఈ ప్రాజెక్ట్ షూటింగ్ 40 శాతం పూర్తవగా.. నెక్ట్స్ షెడ్యూల్ అక్టోబర్ మొదటివారంలో షురూ కానుందని తెలుస్తోంది. హైదరాబాద్‌లో ఈ షెడ్యూల్ మూడు వారాలపాటు కొనసాగనుందట. ఈ చిత్రంలో రవితేజ ఆర్‌పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడని ఫిలింనగర్ సర్కిల్ టాక్. ఈ మూవీని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య తెరకెక్కిస్తుండగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. 2025లో సంక్రాంతి కానుకగా ఈ సినిమా రానున్నట్టు వార్తలు తెరపైకి వస్తుండగా మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. పేరు లక్ష్మణ భేరి.. ఆదాయం చెప్పను తియ్.. ఖర్చు లెక్క జెయ్యన్.. రాజ్యపూజ్యం అన్ లిమిటెడ్..అవమానం జీరో అంటూ ఇప్పటికే ఆర్‌టీ75లో రవితేజ పాత్ర ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేశారు మేకర్స్. రవితేజ ఖాకీ అవతార్‌లో కనిపించిన విక్రమార్కుడు, క్రాక్ సినిమాలు కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచాయని తెలిసిందే. ఇప్పుడు మరోసారి పోలీసాఫీసర్‌గా కనిపించనుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.



## 2025లో మూడు సినిమాలట..

### క్యూరియాసిటీ పెంచేస్తున్న అడివిశేష్

కంటెంట్‌ను నమ్మి సినిమాలు చేసే యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు టాలీవుడ్ యంగ్ హీరో అడివిశేష్ ఈ టాలెంటెడ్ యాక్టర్‌కు ఇండియావైడ్‌గా సూపర్ ఫ్యాన్ బేస్ ఉందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అడివిశేష్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఇప్పటికే గూఢచారి' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'జీ2' లో కూడా నటిస్తున్నాడని తెలిసిందే. వినయ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న 'జీ2' నుంచి ప్రీ లుక్ పోస్టర్ కూడా నెట్టింట చక్కర్లు కొడుతోంది. మరోవైపు షనీల్ డియో (డెబ్యూడైరెక్టర్) కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న డెకాయిట్‌లో కూడా నటిస్తున్నాడు. శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ మూవీ టైటిల్ టీజర్ ఇప్పటికే సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. వీటితోపాటు మూడో ప్రాజెక్ట్ (వివరాలు తెలియాల్సి ఉంది)ను కూడా చేస్తున్నాడు. మూడో సినిమా గురించి అడివిశేష్ 2025లో మూడు సినిమాలు విడుదల అనే ట్వీట్‌తో క్లారిటీ ఇచ్చేశాడని అర్థమవుతోంది. అడివిశేష్ మూడో ప్రాజెక్ట్ శైలేష్ కొలను డైరెక్షన్‌లో నాని నటిస్తోన్న హిట్ 3 అయి ఉంటుందా..? ఇందులో ఏమైనా కీ రోల్ చేస్తున్నాడా..? అంటూ తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు. మొత్తానికి అడివిశేష్ వచ్చే ఏడాది వరుస సినిమాలతో ఫాలోవర్లకు ఊపిరాడకుండా చేయాలని గట్టిగానే ఫిక్సయినట్టు తాజా ట్వీట్‌తో అర్థమవుతోంది.





ఓ పీడ కలొచ్చుండాది జోగులా..

## యాక్షన్ ప్యాక్‌డ్‌గా 'దేవర' రిలీజ్ ట్రైలర్

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వస్తున్న చిత్రం దేవర. నందమూరి అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఆసక్తిగా ఈ సినిమా కోసం ఎదురుచూస్తుండగా.. ఈ చిత్రం సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అరవింద సమేత వీర రాఘవ' వంటి బ్లాక్ బస్టర్ తరువాత ఎన్టీఆర్ సోలోగా వస్తుండటంతో ఈ మూవీపై ఇటు టాలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా వైడ్‌గా భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేయగా.. రికార్డు వ్యూస్‌తో యూట్యూబ్‌లో దూసుకుపోతుంది. అయితే నేడు ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా ప్లాన్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా మూవీ నుంచి రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్‌లో ఎన్టీఆర్ పవర్‌ఫుల్ డైలాగ్స్, అబ్బురపరిచే యాక్షన్ సన్నివేశాలు ఉండడంతో మూవీ అభిమానులకు ఫుల్ మీల్స్ పెట్టబోతున్నట్లు తెలుస్తుంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com